


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 214 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 9 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :214 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 9 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## హైదరాబాద్‌లో యువకులను 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు..

# ముగ్గురి మృతి

- సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద రోడ్డు ప్రమాదం
- నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీదదా వెళుతున్న ఇద్దరిని ఈడ్చుకెళ్లిన కారు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మిగతా 2లో




## విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను తగ్గించుకోండి

- ఛార్జీలను 25 శాతం మేర తగ్గించుకోవాలని ప్రధాన విమానాశ్రయాలకు ఆదేశాలు
- మూడు నెలల పాటు తగ్గింపులు అందించాలని సూచన
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో నష్టాలు చవిచూసిన విమానయాన సంస్థలు

మిగతా 2లో

# వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

- దోచుకో.. పంచుకో.. తినుకో సిద్ధాంతంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్న జగన్
- రెండేళ్లలో చంద్రబాబు రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపణ
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని మడిపాటు
- వచ్చే సంవత్సరం పాదయాత్ర
- నా పాదయాత్రలో చంద్రబాబుకి రోజుకో సినిమా
- తాడేపల్లిగూడెం పార్టీ నేతల సమావేశంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి



పెన్ పవర్ డెస్క్: వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర మొదలవుతుందని, ఆ తరువాత చంద్రబాబుకు రోజుకో సినిమా చూపిస్తామని వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తాడేపల్లిగూడెం పార్టీ నేతలతో వైయస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి పాలనకు సగం టర్మ్ అయిపోయింది. మిగిలింది ఒక సగం టర్మ్ మాత్రమే. ఇంకో సంవత్సరం దాటితే, రేపటి సంవత్సరం వచ్చేసరికి నా పాదయాత్ర కూడా స్టార్ట్ అవుతుంది. దాని తర్వాత నేను కూడా రోడ్డుమీదకు వచ్చి ఒకటిన్నర సంవత్సరం ప్రజలతోనే నియోజకవర్గాల్లో తిరుగుతూ ఉంటాను. పాదయాత్ర స్టార్ట్ అయిన తర్వాత చంద్రబాబుకు ప్రతి రోజు సినిమా చూపిస్తాం.

మిగతా 2లో





## రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం,

# ఆర్థిక ప్రగతి

- రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా రహదారుల నిర్మాణం
- పోర్టులను అనుసంధానిస్తూ ఈస్ట్-వెస్ట్ కారిడార్ అభివృద్ధికి ప్రణాళికలు
- గోదావరి పుష్కరాల్లోపే రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశం
- తక్కువ రవాణా వ్యయం కోసం ఈవీ బస్సుల వినియోగం పెంచాలని సూచన
- ప్రధాన నగరాలకు ఔటర్ కారిడార్ల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని నిర్దేశం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో కేవలం ప్రయాణ సౌకర్యాల కోసమే కాకుండా, విస్తృతమైన ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేలా పటిష్ఠమైన

మిగతా 2లో



# 'మావిగన్' నచ్చకపోతే 'అయోధ్య' అని పేరు పెట్టుకోండి

- మావిగన్ ప్లాన్ తప్పు అయితే నిరూపించాలని పేర్ని నాని సవాల్
- వందేళ్లయినా అమరావతి పూర్తి కాదని వ్యాఖ్య
- అమరావతిలో రాధాకృష్ణ బ్యాచ్ ఎంత పెట్టుబడి పెట్టిందో చెప్పాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని వ్యవహారం, ఏబీఎన్ రాధాకృష్ణ వ్యాఖ్య లపై మాజీ మంత్రి, వైసీపీ పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు. కృష్ణా జిల్లా ముస్తాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అటు రాజధాని అంశంపై,

మిగతా 2లో

## 'మై టీడీపీ యాప్' టాప్ పెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

- కష్టపడిన వారిని గుర్తించడమే పార్టీ సిద్ధాంతమని లోకేశ్ స్పష్టీకరణ
- మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమావేశం
- కార్యకర్తలను పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్న వైనం

మిగతా 2లో



## నేడు కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు...

## పోలింగ్ కు సర్వం సిద్ధం



- అసోం, కేరళ, పుదుచ్చేరిలో గురువారం ఒకే విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగం
- అసోంలో వరుసగా మూడోసారి గెలుపుపై బీజేపీ ధీమా
- కేరళలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని పినరయి విజయన్ సర్కార్ పోరాటం
- పుదుచ్చేరిలో ఐదోసారి సీఎం పీఠంపై ఎన్. రంగస్వామి కన్ను

మిగతా 2లో

## ప్రభుత్వ అప్పుల్లో భారీ తేడా ఉంది...

# గవర్నర్ జోక్యం చేసుకోవాలి



- ప్రభుత్వ అప్పులపై ఆర్థిక శాఖ తప్పుడు లెక్కలు చూపిందని గవర్నర్‌కు బొత్స ఫిర్యాదు
- 2024-25లో రూ. 20,500 కోట్లకు పైగా అప్పులు తక్కువగా చూపారని ఆరోపణ
- ఆఫ్-బడ్జెట్ రుణాలు, పబ్లిక్ అకౌంట్ నిధులను దాచిపెట్టారని విమర్శ
- తప్పుడు సమాచారాన్ని ఉపసంహరించుకుని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మిగతా 2లో

## నారా లోకేశ్ 87వ రోజు ప్రజాదర్బార్...

# సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

- మంగళగిరిలో 87వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి లోకేశ్
- విజయవాడ లోకో షెడ్ ప్రైల్వే గ్యాలా డిపో తరలించవద్దని సిబ్బంది వినతి
- కోవిడ్ నష్టాల నేపథ్యంలో ఆదుకోవాలని కోరిన ప్రైవేట్ బస్సుల యజమానులు
- తమ భూమి కబ్జాకు గురైందని న్యాయం చేయాలని కోరిన కర్నూలు మహిళ
- వినతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లోకేశ్ హామీ

మిగతా 2లో



## లెబనాన్‌పై ఇజ్రాయెల్

# భీకర దాడులు..

## ఒప్పందం నుంచి వైదొలగుతామన్న ఇరాన్... హార్మూజ్ మళ్లీ మూసివేత

- మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ ఒప్పందానికి గండి
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో మళ్లీ రాజుకున్న వివాదం
- కీలకమైన హార్మూజ్ జలసంధిని మరోసారి దిగ్బంధించిన ఇరాన్
- ఒప్పందం నుంచి వైదొలగుతామంటూ అమెరికా, ఇజ్రాయెల్‌కు హెచ్చరిక
- చమురు రవాణా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన

పెన్ పవర్ డెస్క్:మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపన కోసం అమెరికా చొరవతో కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగించడమే దీనికి కారణమైంది. ఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఇరాన్, ఒప్పందం నుంచి వైదొలగుతామని



మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### నేడు కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు...

# పోలింగ్ కు సర్వం సిద్ధం

దేశవ్యాప్తంగా రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తున్న అసెంబ్లీ ఎన్నికల పర్వంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రేపు (ఏప్రిల్ 9) గురువారం నాడు రెండు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అసోం, కేరళ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత ప్రజలు తమ తీర్పును ఇవ్వనున్నారు. మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు ప్రాంతీయ, జాతీయ పార్టీలకు ఒక అగ్నిపరీక్షగా మారనున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈ ఎన్నికల ఫలితాలను కూడా మే 4వ తేదీన ప్రకటించనున్నారు.

**అసోం**

అసోంలోని మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పట్టుదలగా ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి సారథ్యం వహిస్తున్నారు. 2016-2021 మధ్యకాలంలో శర్బానంద సోనోవాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ నేతృత్వంలో పునరుజ్జీవం కోసం ప్రయత్నిస్తోంది. ఆరు పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి బరిలోకి దిగుతోంది. అఖిల్ గొగోయ్‌కు చెందిన రైజోర్ దళ్, లురిన్‌జ్యోతి గొగోయ్ నేతృత్వంలోని అసోం జాతీయ పరిషత్ ఈ కూటమిలో కీలక పార్టీలుగా ఉన్నాయి.

రాష్ట్రంలో మొత్తం 2.5 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో దాదాపు సమానంగా 1.25 కోట్ల మంది పురుషులు, మహిళలు ఉన్నారు. అలాగే 318 మంది ట్రాన్స్‌జెండర్లు, 18-19 ఏళ్ల మధ్య వయసున్న 6.42 లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు.

**కేరళ**

దేశంలో కమ్యూనిస్టులకు చివరి కంచుకోటగా ఉన్న కేరళలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు సీపీఎం నేత, ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. గత నాలుగు దశాబ్దాలుగా కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వస్తున్నాయి. అయితే, 2021లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) వరుసగా రెండోసారి గెలిచి ఈ సంప్రదాయానికి తెరదించింది. ఇంతకుముందు ఎల్‌డీఎఫ్ 1980, 1987, 1996, 2006, 2016లో అధికారంలోకి వచ్చింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఈసారి ఎలాగైనా తిరిగి అధికార పగ్గాలు చేపట్టాలని భావిస్తోంది. ఈ కూటమి 1982, 1991, 2001, 2011లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది.

కేరళలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.39 కోట్ల మంది మహిళలు, 1.32 కోట్ల మంది పురుషులు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 4.66 లక్షల మంది యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు.

**పుదుచ్చేరి**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌సీ) అధినేత, ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రి పీఠంపై కన్నేశారు. కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన 76 ఏళ్ల రంగస్వామి, 1990లలో మంత్రిగా పనిచేశారు.

2001లో తొలిసారి, 2006లో రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా 2008లో వైదొలిగి, సొంతంగా ఏఐఎన్ఆర్‌సీ పార్టీని స్థాపించారు. 2011లో మళ్లీ గెలిచి మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2016-2021 మధ్య ప్రతిపక్ష నేతగా వ్యవహరించి, 2021లో ఎన్డీయే కూటమిలో భాగంగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారు.

ఇక్కడ మొత్తం 9.44 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 5 లక్షల మంది మహిళలు, 4.43 లక్షల మంది పురుషులు, 139 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 23,033 మంది యువత తొలిసారి ఓటు వేయనున్నారు.

### ప్రభుత్వ అప్పుల్లో భారీ తేడా ఉంది...

# గవర్నర్ జోక్యం చేసుకోవాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్పుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ తప్పుడు, అసంపూర్ణ సమాచారాన్ని శాసనమండలికి సమర్పించిందని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు బుధవారం ఒక లేఖ రాశారు. ఫిబ్రవరిలో జరిగిన మండలి సమావేశాల్లో ఓ ప్రశ్నకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన సమాధానంలో వాస్తవ అప్పుల వివరాలు పూర్తిగా లేవని, గణాంకాలను తక్కువ చేసి చూపారని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ కాపీని వైసీపీ మీడియాకు విడుదల చేసింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం అప్పులు రూ. 60,485 కోట్లుగా పేర్కొన్నారని, అయితే కాగ్ (జూ+) ఆడిట్ ప్రకారం వాస్తవ నికర అప్పులు రూ. 81,082 కోట్లుగా ఉన్నాయని బొత్స వివరించారు. ఈ రెండింటి మధ్య రూ. 20,500 కోట్లకు పైగా తేడా ఉందని, దీనికి సరైన కారణాలు కనిపించడం లేదని తెలిపారు. ఆర్‌బీఐ నుంచి తీసుకున్న 'వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సులు', పబ్లిక్ అకౌంట్ కింద ఉన్న డిపాజిట్లు, రిజర్వ్ ఫండ్స్ వంటి ముఖ్యమైన అంశాలను ప్రభుత్వం తన లెక్కల్లో కలపలేదని ఆయన ఆరోపించారు.

అంతేకాకుండా, 2025-26లో ఆఫ్-బడ్జెట్ రుణాలు ఏవీ లేవని ప్రభుత్వం చెప్పడం కూడా సరికాదన్నారు. మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు సమీకరించారని, ఇవి కూడా ప్రభుత్వ అప్పుల కిందకే వస్తాయని గుర్తుచేశారు. శాసనసభకు తప్పుడు సమాచారం ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని బొత్స అన్నారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని, తప్పుడు సమాధానాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అలాగే, ఈ తేడాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనానికి సంబంధించిన విషయాల్లో పారదర్శకత చాలా అవసరమని బొత్స తన లేఖలో స్పష్టం చేశారు.

# వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

- మొదటి పేజీ తరువాయి

**చంద్రబాబు చర్యలతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేస్తున్నారు**

అన్నింటికన్నా ఆశ్చర్యం కలిగించే విషయం మావిగన్. నిజంగా చంద్రబాబుకు మోస్ట్ ప్రాక్టికల్ సొల్యూషన్ ఇచ్చాం. మనం చాలా లౌక్యంగా అయ్యా చంద్రబాబు గారు మీరు చేస్తున్న చర్యలతో రాష్ట్రానికి ఎప్పటికీ క్యాపిటల్ లేకుండా చేస్తున్నారు. అలా చేయడం వల్ల రాష్ట్రానికి మీ తీరుతో క్యాపిటల్ అనేది ఉండదు. ఇది మానుకోండి. అమరావతి అని మీరు రైతులను మోసం చేస్తున్నారు. అమరావతి అని ప్రజలను మోసం చేస్తున్నారు. ఆ అమరావతిలో రోడ్లు వేయడానికే, కరెంట్ ఇవ్వడానికి, డ్రైనేజీ వ్యవస్థ, నీళ్లు వంటి బేసిక్ వసతులు కల్పించడానికే నీ అంతట నువ్వే ఎకరాకు రూ.2 కోట్లు ఖర్చు అవుతుందని సెంట్రల్ గవర్నమెంట్‌కు, బ్యాంకులకు డీపీఆర్‌లు ఇచ్చావు. ఈ లెక్కన 50 వేల ఎకరాలకే లక్ష కోట్లకు దిక్కులేదు అనుకుంటే... మరో 50 వేల ఎకరాలు అని చెప్పి మళ్లీ భూ సమీకరణ చేపడుతూ... లక్ష ఎకరాల అమరావతి అని చెబుతున్నావు. ఈ లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లతో నీవు నిరంతరం రోడ్లు వేయడం, కరెంట్ ఇవ్వడం, డ్రైనేజీ పనులు చేస్తూనే ఉంటావు. నిరంతరం నీళ్లు ఇచ్చేందుకే అవస్థలు పడుతుంటే ఇక రాజధాని ఎప్పుడు వస్తుంది? ఎన్ని దశాబ్దాలు పడుతుంది? ఇప్పటికే 12 ఏళ్లు అయిపోయింది. 2014 నుంచి ఇప్పటి వరకు ఏమీ లేదు. ఇంకా ఎన్ని దశాబ్దాలు పడుతుందో తెలియదు. డబ్బంతా రోడ్లకే, కరెంట్, నీళ్లకే ఖర్చు అవుతుంది. ఆ రెండు లక్షల కోట్ల విలువ దశాబ్దాలకు రూ.4 లక్షల కోట్లు అవుతుందో, ఇంకా ఎంత అవుతుందో తెలియదు. చివరికి 12 ఏళ్ల తర్వాత కూడా రాష్ట్రానికి రాజధాని లేదు. ఇంకా 20 ఏళ్ల తర్వాత కూడా అదే పరిస్థితి ఉంటుంది. అయ్యా చంద్రబాబు ఇది మానుకో. ఆ రెండు లక్షల కోట్లలో 10 శాతం ఖర్చు చేస్తే చాలు.

ప్లాన్-ఏ వద్దన్నారు..ప్లాన్-బీపై ఎందుకు ఆలోచన చేయడం లేదు? నేను ఇంతకు ముందు రాజధాని విషయంలో మంచి ఆలోచన చెప్పాను. ప్లాన్--ఏ కింద రాష్ట్రంలో అన్నింటి కన్నా పెద్ద నగరం విశాఖపట్నం... అందులో కార్యనిర్వాహక రాజధాని పెడితే ఎలాంటి ఖర్చు అవసరం ఉండదు. శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం అప్పట్లో మనం కర్నూలుకు మాటిచ్చాం, అది నెరవేర్చుతూ అక్కడ న్యాయ రాజధాని పెడుతూ... ఇక్కడే అమరావతిలో శాసన రాజధాని తీసుకువస్తే బాగుంటుందయ్యా అని చెబితే నానాయాగీ చేసి, రాజకీయాలు చేసి అవి వద్దు అన్నారు. సరే పోనీ అది వద్దు. కనీసం ఈ ప్రాంతంలోనైనా నీవు చేసే పనికి రాజధానినే లేకుండా పోతుందయ్యా. ఆ పని చేయకుండా కనీసం ఇక్కడైనా ఆలోచన చేయమని ప్లాన్--బీ కింద మావిగన్ ప్రతిపాదన తెచ్చాం.

**10 శాతం ఖర్చు చేస్తే ఇక్కడే బ్రహ్మాండమైన రాజధాని**

మచిలీపట్నంలో పోర్టు కట్టింది నీవు కాదు చంద్రబాబు, మేం కట్టాం. వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పోర్టుకు భూసేకరణ చేపట్టాం. మన హయాంలోనే అనుమతులు తీసుకువచ్చాం. మన హయాంలోనే ఫైనాన్షియల్ క్లోజర్ చేశాం. అప్పట్లోనే బ్యాంకులతో నీట్‌గా టైఅప్ చేసి వర్క్ 30--40 శాతం కూడా పూర్తి చేశాం. ఆ పోర్టు పూర్తవుతుంది. మచిలీపట్నం నుంచి విజయవాడకు 70 కిలోమీటర్లు, విజయవాడ నుంచి గుంటూరుకు 40 కిలోమీటర్లు. మొత్తం ఈ 110 కిలోమీటర్లు హైవే ఉంది. విజయవాడలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంది. మచిలీపట్నంలో పోర్టు వస్తుంది. ఈ హైవేకు అటుఇటుగా అమరావతిలో కట్టే బిల్డింగ్‌లు ఇక్కడ కడితే బాగుంటుంది. మచిలీపట్నం నుంచి (మా), విజయవాడ నుంచి (వీ), గుంటూరు నుంచి (గన్) అంటూ మావిగన్ ప్రతిపాదన చేశాం. ఈ 110 కిలోమీటర్ల ఎకనామిక్ కారిడార్‌ను క్యాపిటల్ కారిడార్‌గా డిక్లేర్ చేసి, ఆ కట్టే బిల్డింగ్‌లు ఇక్కడ కట్టండి. రెండు లక్షల కోట్లలో 10 శాతం ఇక్కడ ఖర్చు చేసి రోడ్లకు కనెక్టివిటీ ఇస్తే చాలు, బ్రహ్మాండమైన రాజధాని ఇక్కడే తయారు అవుతుంది. డే వన్ నుంచే రాజధాని వస్తుంది. ఒక గ్రోత్ ఇంజన్ తయారవుతుంది. కనీసం 20 ఏళ్ల తర్వాత అయినా మన పిల్లలు ఉద్యోగాల కోసం ఎక్కడికక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. మావిగన్‌లోనే ఉద్యోగాలు దొరుకుతాయి అని చిలుకకు చెప్పినట్లు చెప్పినా, చంద్రబాబు ఒప్పుకోవడం లేదు.

**జగన్ ఏం చెప్పినా ఆహా అంటున్నారు..**

మనమంతా బాగా, లౌక్యంగా చెప్పినా గానీ ఆహా అంటున్నాడు. ఎందుకు అహా... ఎందుకు వద్దు... కారణం అక్కడ రెండు లక్షల కోట్లలో మొబిలైజేషన్ వర్కుల పేరుతో 8 శాతం కమిషన్లు తీసుకోవచ్చు. మావిగన్‌లో ఈ ఆదాయాలు ఉండవు కదా. కాబట్టి మావిగన్ వద్దు. అమరావతిలో కాంట్రాక్టర్లు ఎవరు అంటే ఒకడు ఈనాడు రామోజీరావు వియ్యంకుడు రఘు (ఆర్‌జీవీ), ఇంకొకరు బీఎస్‌ఆర్ (బల్క్ శ్రీనివాసరావు). వీరు చంద్రబాబు బినామీలు. అమరావతి కాంట్రాక్టర్లు అంతా వీళ్లే. దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడం. అందుకనే మావిగన్ అంటే ఆహా... వైయస్ జగన్ ఏం చెప్పినా ఆహా అంటున్నారు.

# రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి

- మొదటి పేజీ తరువాయి

కనెక్టివిటీ వ్యవస్థను నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం రహదారులు-భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రహదారుల నిర్వహణ, గుంతలు లేని రోడ్లు, ఈవీ బస్సుల వినియోగం, పోర్టు కారిడార్ల అభివృద్ధి వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**వివిధ నగరాలకు ఔటర్ కారిడార్లు**

రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఔటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. నగరాలకు రింగ్ రోడ్లు నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీతో అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు.

**రహదారుల పటిష్ఠ నిర్వహణపై సీఎం దృష్టి**

రాష్ట్రంలో రహదారుల నిర్వహణ అత్యంత పటిష్ఠంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45,433 కిలోమీటర్ల రోడ్లలో, ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్లపై గుంతలు పడిన వెంటనే మరమ్మతులు చేపడితే సమస్యలు ఉండవని, ఇది నిరంతర ప్రక్రియగా సాగాలని సూచించారు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ రహదారుల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు నల్లరేగడి నేలలున్న ప్రాంతాల్లో హైబ్రీడ్ మోడల్‌లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్లు నిర్మించాలని, కాలువ గట్ల వెంబడి తరచూ దెబ్బతింటున్న 570 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కొత్త సాంకేతికతపై యూనివర్సిటీలతో అధ్యయనం చేయించాలని సూచించారు.

**గోదావరి పుష్కరాలకు ప్రత్యేక కార్యాచరణ**

రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 471 గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రహదారుల అభివృద్ధి పనులు రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పుష్కరాల కోసం రూ.400 కోట్ల 'సాస్కీ' నిధులతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

**పోర్టుల అనుసంధానమే లక్ష్యం**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పోర్టులు గుండెకాయ వంటివని, వాటిని కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలని చంద్రబాబు అన్నారు. పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ తరహాలో, తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను పోర్టుల హబ్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్ల నిర్మాణంతో లాజిస్టిక్స్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులను అనుసంధానిస్తూ, పొరుగు రాష్ట్రాల సరిహద్దుల వరకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా నిర్మించాలని చెప్పారు. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను 'ఏపీ లింక్' ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు.

**ఆర్థిక ప్రగతికి జాతీయ రహదారుల కీలకం**

"జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం జరుగుతుంది" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రహదారుల నిర్మాణం ద్వారా సమీప ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తులకు కేంద్రంగా మారుతున్న ఏపీ నుంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరుకు రవాణా సులభతరం కావాలని చెప్పారు.

ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం-దోర్నాల, కల్వకుర్తి-నంద్యాల వంటి జాతీయ రహదారులతో కనెక్టివిటీ మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే రెండేళ్లలో 1335 కిలోమీటర్ల జాతీయ రహదారులు అందుబాటులోకి వస్తాయని, ఈ ఏడాదిలోనే రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**తక్కువ వ్యయంతో ఈవీ బస్సులు**

ప్రజా రవాణాను అతి తక్కువ వ్యయంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి ఎలక్ట్రిక్ బస్సుల వినియోగమే సరైన మార్గమని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం కిలోమీటరుకు రూ.72గా ఉన్న ఈవీ బస్సు నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు వివిధ మోడళ్లను అధ్యయనం చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. అన్ని కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులనే నడపాలని, ప్రజల్లో ఈ-సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించి దానిని ఒక మాస్ ట్రాన్స్‌పోర్ట్‌గా మార్చాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో యువకులను 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు..

హైదరాబాద్‌లోని సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో హోండా కారును వేగంగా నడిపిన ఒక డ్రైవర్, రోడ్డు మీద నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న మరో ఇద్దరు యువకులను ఢీకొట్టి 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుని వెళ్లాడు. ఆ తర్వాత కారు పల్టీ కొట్టింది.

ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచి వెళుతున్న యువకుడు కూడా ఈ ఘటనలో మృతి చెందాడు. కాలేజీ విద్యార్థులు కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు..

- మొదటి పేజీ తరువాయి

హెచ్చరించింది. అంతేకాకుండా, ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని మరోసారి దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించింది. ఈ పరిణామంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చొరవతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య రెండు వారాల పాటు యుద్ధ విరమణ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రాకపోకలను సురక్షితంగా కొనసాగించడం ప్రధాన షరతు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని, అక్కడి హెజ్బొల్లా బలగాలపై తమ సైనిక చర్యలు యథావిధిగా కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అన్నట్లుగానే, లెబనాన్‌పై, ముఖ్యంగా రాజధాని బీరట్‌లోని నివాస, వాణిజ్య ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ పౌరులు మరణించగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఇజ్రాయెల్ చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని బాహాటంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మండిపడ్డారు. దాడులు ఇలాగే కొనసాగితే తాము ఒప్పందం నుంచి వైదొలగాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు, తమ అనుమతి లేకుండా హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించే ఏ నౌకనైనా ధ్వంసం చేస్తామని ఇరాన్ సాయుధ దళాలు ప్రకటించాయి. ఇటీవల ఇరాన్ ఈ జలసంధిని నిరోధించినప్పుడు అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. తాజా పరిణామం మళ్లీ అదే ఆందోళనకు దారితీస్తోంది. వాస్తవానికి పాకిస్థాన్‌లో శాశ్వత శాంతి చర్చలు జరపాలని ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ద

అయితే, హర్మూజ్ జలసంధిపై పూర్తి సైనిక ఆధిపత్యం తమకే ఉండాలని, దాని ద్వారా ప్రయాణించే నౌకల నుంచి రుసుము వసూలు చేసే హక్కు కల్పించాలని ఇరాన్ కొత్త డిమాండ్లను తెరపైకి తెచ్చింది. కానీ అమెరికా, ఇజ్రాయెల్ మాత్రం ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టం చేస్తున్నాయి. ఈ పరస్పర విరుద్ధ వైఖరులతో మధ్యప్రాచ్యంలో శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. హర్మూజ్ జలసంధి భద్రతపై ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# 'మై టీడీపీ యాప్' టాప్ పెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

కష్టపడి పనిచేసే వారిని గుర్తించడమే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, 'మై టీడీపీ యాప్'ను సమర్థవంతంగా వినియోగిస్తున్న టాప్ 10 పెర్ఫార్మర్స్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ ఆత్మీయ భేటీ జరిగింది. ఈ సందర్భంగా లోకేశ్... పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. వారి కుటుంబ నేపథ్యం, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ, సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగుతున్న కార్యకర్తల సేవలను ఆయన అభినందించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, వారి శ్రమను ఎన్నటికీ విస్మరించబోమని లోకేశ్ భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఇలాగే పనిచేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు మంత్రి లోకేశ్ తో నేరుగా మాట్లాడే అవకాశం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# నారా లోకేశ్ 87వ రోజు ప్రజాదర్బార్... సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గ్యాలా డిపోను తరలించవద్దని సిబ్బంది మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కొవిడ్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకునేందుకు రీప్లేస్‌మెంట్ వాహనాలను ఇప్పించాలని హైర్ బస్సుల యజమానులు కోరారు. కర్నూలు జిల్లా, గూడెంపాడుకు చెందిన ఎస్. చిన్న శివమ్మ అనే మహిళ తన వారసత్వ ఆస్తి అయిన 2.63 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని, దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని మంత్రిని అభ్యర్థించారు. ప్రజలు సమర్పించిన వినతులను సావధానంగా విన్న లోకేశ్, వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# 'మావిగన్' నచ్చకపోతే 'అయోధ్య' అని పేరు పెట్టుకోండి

- మొదటి పేజీ తరువాయిద

ఇటు మీడియా సంస్థల తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ప్లాన్ తప్పు అయితే నిరూపించాలని పేర్ని నాని సవాల్ విసిరారు. వందేళ్లయినా పూర్తికాని అమరావతి పేరుతో కేవలం దోపిడీ చేస్తున్నారని, రాష్ట్రం అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కొత్త ప్రతిపాదన తెచ్చారని సమర్థించారు. "ఒకవేళ మావిగన్ నచ్చకపోతే ఆ ప్రాంతానికి అయోధ్య అని పేరు పెట్టుకోండి, కానీ దోపిడీ మాత్రం ఆపండి" అని అన్నారు. ఆడవాళ్లను కించపరిచేలా మాట్లాడినందుకు రాధాకృష్ణ తక్షణమే క్షమాపణలు చెప్పాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. కాశీకి వెళ్లి సిగ్గుశరం వదిలేసి వచ్చారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో దాదాపు 4 లక్షల కోట్లు అప్పు చేస్తే ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. వాలంటీర్ల విషయంలో ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎందుకు బయటపెట్టడం లేదని అడిగారు. కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. అమరావతిలో రాధాకృష్ణ 'బ్యాచ్' ఎంత పెట్టుబడి పెట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

# విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను తగ్గించుకోండి

దేశీయ విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను 25 శాతం మేర తగ్గించుకోవాలని దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విమానయాన సంస్థలకు మూడు నెలల పాటు ఈ తగ్గింపులు అందించాలని సూచించింది. ఇరాన్, అమెరికా యుద్ధం నేపథ్యంలో, దేశీయ విమాయాన సంస్థలు ఇండిగో, ఎయిరిండియా సంస్థలు భారీ నష్టాలు చవిచూశాయి. దీనితో, విమానాశ్రయాలు వసూలు చేసే కొన్ని ఛార్జీలను తగ్గించేలా చూడమని ఆయా విమానయాన సంస్థలు కేంద్రాన్ని కేంద్రాన్ని కోరాయి. ఈ క్రమంలో కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్స్ ఎకనమిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ఆదేశాలపై స్పందించింది. ఈ తాత్కాలిక ఛార్జీల తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# మత్స్యకారుల కోసం 28 కోట్లతో జెట్టికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

పెద్దఎత్తున తరలివచ్చి కృతజ్ఞతలు తెలిపిన మత్స్యకార కుటుంబాలు

జెట్టీ నిర్మాణంతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు: ఎమ్మెల్యే

జెట్టీపై ఎన్నికలకు ముందు మాట ఇచ్చా - ఇప్పుడు నిలబెట్టుకుంటున్నా

రామాయపట్నం పోర్టు నిర్వాసితులందరికీ కూటమి ప్రభుత్వంలో న్యాయం జరిగినది

జగన్ పాలనలో పునరావాస కాలనీల గురించి పట్టించుకోలేదు

వైసీపీ నేతలవి దిగజారుడు మాటలు - మరోసారి కర్రుకాల్చి వాతలు పెట్టాల్సిందే: ఎమ్మెల్యే

మూడేళ్లలో పారిశ్రామిక అభివృద్ధిని మీ కళ్ళతోనే చూస్తారు

యువత శిక్షణకు కర్లపాలెం వద్ద త్వరలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం: ఎమ్మెల్యే



**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 08**

రామాయపట్నం పోర్టు భూనిర్వాసితులకు సంబంధించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా, గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీ మూర్తింపేట గ్రామం వద్ద 4.69 ఎకరాల్లో 28 కోట్ల అంచనాతో ఏర్పాటుకానున్న జెట్టి నిర్మాణానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, మొదటి ఇటుకను పేర్చి, జెట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణంతో మత్స్యకారుల పడవల రాకపోకలకు సౌకర్యంగా ఉండనుంది. ఈ నిధులతో 328 అడుగుల పొడవు, 16 వెడల్పున జెట్టి నిర్మాణంతో పాటు, నిర్వహణ కోసం కార్యాలయాలు, మత్స్యకారుల సౌకర్యాలకు భవనాలు, చేపల ప్లాట్ ఫారం, ఇంకా అనేక మౌలిక వసతులు ఏర్పాటవుతాయని ఎమ్మెల్యే అన్నారు. వచ్చేఏడాది ఏప్రిల్ చివరికల్లా జెట్టి అందుబాటులోకి వస్తుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు జెట్టి నిర్మాణానికి హామీ ఇచ్చామని, శంకుస్థాపనతో మాట నిలబెట్టుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ నిర్మాణం పూర్తయితే మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. భూ నిర్వాసితులకు న్యాయమైన నష్ట పరిహారం అందించడం ఇప్పటికే జరిగినదన్నారు. గత ప్రభుత్వ వైసీపీ పాలనలో పునరావాస కాలనీలో వసతులను మధ్యలో వదిలేశారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో రెండు గ్రామాల్లో అసంపూర్తి పనులన్నీ పూర్తి చేసామన్నారు. కర్లపాలెం లేఅవుట్ విషయంలో కోర్టు కేసులు ఉన్నప్పటికీ, వారిని కలెక్టర్ వద్ద కూర్చోబెట్టి, మాట్లాడి ఒప్పించి ఆ సమస్యను కూడా పరిష్కరించినట్లు ఇంటూరి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు సంబంధిత మంత్రులు, మారి టైం బోర్డు అధికారులను అనేకసార్లు కలిసి మత్స్యకారులకు న్యాయం చేసామని చెప్పుకొచ్చారు. మత్స్యకారుల కోరిక మేరకు, మరొకసారి వారిని కలిసి, జెట్టి నిర్మాణాన్ని పొడిగించేందుకు కృషి చేస్తానన్నారు. వైసిపి పరిపాలనలో మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ అందించలేదని, బోట్లు ఇవ్వలేదని, పైగా 117 జీవోతో భూములు లాక్కునేందుకు ప్రయత్నించారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే జీవో రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తమిళనాడు స్పీడ్ బోట్ల కారణంగా స్థానిక మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటుందని, తీరప్రాంత ఎమ్మెల్యేలందరూ ఈ నెల 9వ తేదీన సమావేశమై దానిపై నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రామాయపట్నం పోర్టుతో పాటు బిపిసిఎల్, ఇండోసోల్, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నందున, యువతకు శిక్షణ ఇచ్చేందుకు కర్లపాలెం వద్ద త్వరలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం కాబోతున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. వైసీపీ నేతలు ఇంకా విధ్వంసం వైపు ప్రయాణిస్తున్నారని, వారి తీరులో మార్పు కనపడడం లేదని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఘాటుగా విమర్శించారు. ఒకవైపు ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం వేగంగా జరుగుతుంటే, మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి పాడటం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవాలను విడమరిచి చెప్పిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆఫీస్ పై వైసీపీ రౌడీలు దాడికి ప్రయత్నించడాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. అనంతరం కర్లపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీకి వెళ్లిన ఎమ్మెల్యే రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాం, మండల తహశీల్దార్ బాలకిషోర్, మండల అభివృద్ధి అధికారి వై.వెంకటేశ్వరరావు, గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, సాలిపేట గ్రామ టిడిపి అధ్యక్షులు వేముల స్వామి, పార్టీ నాయకులు ఆవుల శీను, కర్లపాలెం మాజీ సర్పంచ్ చేపల రమణయ్య, అట్ల కోటయ్య, గొల్లప్రోలు హరిప్రసాద్, పొట్టేళ్ల మురళి, పోలుగంగు కృష్ణ, గద్దగుంట శ్రీను, అవనిగడ్డ కృష్ణ, యనమల రామారావు, కొండబాబు, సుధాకర్, పలువురు కాపునేతలు, మండలం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కూటమిపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

విజయవాడలో ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ప్రారంభం: మంత్రి గొట్టిపాటి





**అద్దంకి ఆర్సి/విజయవాడ (పెన్ పవర్),ఏప్రిల్ 08**

ప్రజలపై ఎలాంటి అదనపు భారం మోపకుండా, ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నదే ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవి కుమార్ స్పష్టం చేశారు. విజయవాడ, గుణదలలో రూ.35 కోట్లకు పైగా వ్యయంతో నూతనంగా నిర్మించిన ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయాన్ని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంతరాయాలు, లో-వోల్టేజ్ సమస్యలు లేకుండా ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. 95 శాతం ప్రజల సంతృప్త స్థాయిని అందుకునేలా సిబ్బంది మరింత సమర్థవంతంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**రైతులకు పగటిపూటే విద్యుత్....**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా త్వరలోనే అన్నదాతలకు పగటి పూటే 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఈ పథకానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని వెల్లడించారు. అలాగే, పీఎం సూర్యఘర్ తదితర కేంద్ర పథకాల అమలులో రాష్ట్ర విద్యుత్ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల రెండు నెలల కాలంలోనే రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏపీ జెన్కో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధించిందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా పవర్ లాసెస్ తగ్గిస్తూ, ప్రణాళికాబద్ధంగా ఉత్పత్తి పెంచడం వల్లే బయట నుంచి కరెంటు కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయన్నారు. నాణ్యమైన కరెంటు కోసం రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందని, సోలార్, విండ్, పీఎస్పీ పద్ధతుల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే 10 చోట్ల టెండర్లు పిలిచినట్లు ఆయన వివరించారు.

**విపత్తుల వేళ ప్రాణాలకు తెగించి..**

విజయవాడ వరదలు, విశాఖ తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమించారని మంత్రి కొనియాడారు. విపత్తు వేళల్లో తమ కుటుంబాలను సైతం వదిలిపెట్టి ఎస్పీడీసీఎల్ పరిధి నుంచి దాదాపు 2 వేల మంది సిబ్బంది వచ్చి సేవలందించడం గొప్ప విషయమన్నారు. కేవలం 24 గంటల్లో 20 వేల విద్యుత్ స్తంభాలను మార్చి సరఫరాను పునరుద్ధరించిన ఘనత సిబ్బందిదేనని ప్రశంసించారు. ఇలా కష్టపడే సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం ముందుండి పరిష్కరిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని. శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె. రామ్మోహన్, ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ కే. విజయానంద్, ట్రాన్స్ కో జేఎండీ సూర్య సాయి ప్రవీణ్ చంద్, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, ఇతర డైరెక్టర్లు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వలేటివారిపాలెం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

- గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించను
- అర్జీదారులకు సహేతుక ఎండార్స్మెంట్ ఇవ్వాలి -రెవెన్యూ సిబ్బందికి ఆదేశం
- సబ్ కలెక్టర్ డి.హిమ వంశీతో కలిసి రికార్డు రూము, వివిధ సెక్షన్ల పరిశీలన
- 167 (బి) రోడ్డుకు భూసేకరణ పురోగతి, పరిహారం చెల్లింపుపై సమీక్ష
- జె.ఎస్. డబ్ల్యు. కంపెనీకి స్థానికంగా భూముల లభ్యత, సర్వే, భూసేకరణపైనా ఆరా
- ఉపాధి హామీ పనులు, మంచినీటి ట్యాంకుల శుద్ధీకరణ, జలధార
- జల హారతి కార్యక్రమ కార్యాచరణపై అధికారులకు దిశా నిర్దేశం



**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఏప్రిల్ 08**

రెవిన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. బుధవారం ఆయన వలేటివారిపాలెం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో రెవెన్యూ సమస్యలు, గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై సబ్ కలెక్టర్ డి. హిమవంశీతో కలిసి ఆయన సమీక్షించారు. మండలానికి త్వరలోనే రెగ్యులర్ తహసీల్దారును నియమిస్తామని చెప్పారు. రెవిన్యూ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అర్జీదారులకు సహేతుకమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపైనా కలెక్టర్ సమీక్షించారు. ఈ ప్రాంతంలో మైనింగ్ చేపట్టనున్న జె.ఎస్. డబ్ల్యు. కంపెనీ కోసం అవసరమైన భూముల లభ్యత, వాటి సర్వే, సేకరణ కోసం స్థానికంగా చేపడుతున్న చర్యలపై కలెక్టర్ ఆరా తీశారు. 167 (బి) రోడ్డుకు భూసేకరణ - పరిహారం చెల్లింపుపైనా ఆయన సమీక్షించారు. ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మండలంలో ఉపాధి హామీ పనులను ముమ్మరంగా చేపట్టాలని, ఉపాధి కూలీలను పూర్తిస్థాయిలో పనులలో భాగస్వాములను చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ప్రత్యేకంగా చేపట్టిన మంచినీటి ట్యాంకుల శుద్ధీకరణ ప్రక్రియలో నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన పునరుద్ఘటించారు. నీటి వనరులకు అవసరమైన మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ' జలధార - జల హారతి ' కార్యక్రమాన్ని మండలంలో విజయవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక పైనా కలెక్టర్ ఆరా తీశారు. ఆయా కార్యక్రమాలను మండల స్థాయిలో అధికారులు సమన్వయంతో చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలోని రికార్డు రూము, ఇతర సెక్షన్లను వారు పరిశీలించారు. రికార్డుల భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. తమ సమస్యల పరిష్కారం కోసం తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట డిప్యూటీ తహసిల్దార్ మధుబాబు, ఎంపీడీవో శంకరరావు, ఏపీవో దయాసాగర్ పలు శాఖల అధికారులు ఉన్నారు.





# చిన్న కండ్లేరు చెరువుకు మొండిచేయి..!

## మర్మత్తుల మాటే మరిచిపోయిన కూటమి ప్రభుత్వం

**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 8**

పుల్లల చెరువు మండల రైతుల గుండెల్లో నిండిన ఆవేదన ఇప్పుడు ఆగ్రహంగా మారుతోంది. ఒకప్పుడు ఈ ప్రాంతానికి జీవనాడిగా నిలిచిన చిన్న కండ్లేరు చెరువు నేడు నిర్లక్ష్యానికి బలైపోయింది. చెరువుల పునరుద్ధరణ పేరుతో కోట్లాది రూపాయలు మంజూరు చేసినట్టు ప్రకటనలు చేసిన ప్రభుత్వం, చిన్న కండ్లేరు చెరువుకు ఎలాంటి నిధులు ఇవ్వకపోవటంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది.

**చెరువు బాగుంటేనే మా బతుకు బాగుంటాయి**

రైతుల ఆశలు ఇప్పుడు ఆవిరైపోతున్నాయి. ఎన్నికల సమయంలో చెరువుల పునరుద్ధరణపై హామీల వర్షం కురిపించిన నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటలను పూర్తిగా మరిచిపోయినట్టుగా కనిపిస్తున్నారు.ఒకప్పుడు వానలు పడగానే నిండిపోయి, వందల ఎకరాల పంటలకు నీరందించిన చిన్న కండ్లేరు చెరువు ప్రస్తుతం గండ్లు పడి, నీరు నిలవని గుంటగా మారిపోయింది.వర్షం వచ్చినా నీరు చేరుతుంది గానీ నిలవదు.చెరువులో పాడైపోయిన బండలు, మూసుకుపోయిన కాలువలు, చీలిపోయిన గట్టులు ఇవే నేటి దయనీయ పరిస్థితికి నిదర్శనం.ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతున్నా, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.చెరువు పేరుతో ఓట్లు దండుకోవడం తప్ప, దాని అభివృద్ధికి ఒక్క అడుగు కూడా వేయలేదని రైతులు మండిపడుతున్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎక్కడికి పోయాయి? అని ప్రశ్నిస్తున్నారు.ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, చెరువుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పథకాల్లో చిన్న కండ్లేరు చెరువుకు చోటే దక్కలేదు. దీంతో మా చెరువు ఏమాత్రం ప్రాధాన్యం లేనిదా? అని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతి సంవత్సరం మంచి వర్షపాతం ఉన్నా, చెరువులో నీటిని నిల్వ చేసుకోలేకపోవడం వల్ల విలువైన నీరు వృథాగా పోతోంది. ఫలితంగా భూగర్భ జలాలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. బోర్లు వేయడానికి రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసినా, నీరు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.స్థానిక ప్రజాప్రతినిధుల మౌనం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది.సమస్య తెలిసినా ఎందుకు స్పందించడం లేదు? అధికారులను ఎందుకు ప్రశ్నించడం లేదు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. కాగితాలపై పథకాలు, సభల్లో హామీలు ఇవి తప్ప చేతల్లో చర్యలు కనిపించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. రైతుల మాటల్లోనే అసలు నిజం దాగి ఉంది.

**చెరువు బాగుంటే పంట బాగుంటుంది...**

పంట బాగుంటే మా బతుకు బాగుంటుంది.ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి చిన్న కండ్లేరు చెరువును మర్మత్తుల జాబితాలో చేర్చి, వెంటనే పనులు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈ నిర్లక్ష్యం రైతుల ఆవేదనను ఆగ్రహంగా మార్చి, పెద్ద ఎత్తున ఉద్యమాలకు దారి తీసే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

# ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యం

**-సాగునీటిని వనరులను సంరక్షించుకుందాం -అధికారులు, సాగునీటి సంఘాల చైర్మన్లకు ఎమ్మెల్యే ఇంటూరి సూచన**

**-జలధార కార్యక్రమంలో భాగంగా కొండికందుకూరు చెరువు సందర్శన**

**-2.5 కోట్లతో రాళ్లపాడు రిజర్వాయర్, 10 కోట్లతో చెరువులు అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించిన ఎమ్మెల్యే**

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 8**

ప్రతి ఎకరాకు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలధార - జలహారతి - సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 45 సాగునీటి సంఘాల చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతు నాయకులు, అధికారులతో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కందుకూరులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో వారందరితో సమావేశం నిర్వహించారు. చెరువులు, ఇతర నీటి వనరులకు సంబంధించి కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, విడుదలైన నిధులు, పనుల వివరాలు, పెండింగ్ పనుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. వాన నీరు, ఇతర వనరుల ద్వారా వచ్చే నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించడమే ధ్యేయంగా అధికారులు, సాగునీటి సంఘాల చైర్మన్లు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటికి సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా, కందుకూరు మండలం కొండికందుకూరు చెరువును రైతులతో కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు సందర్శించారు. అక్కడ పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. కొండికందుకూరు చెరువు అభివృద్ధి, ఆయకట్టు, కాలువలు, తూముల గురించి రైతులతో మాట్లాడారు. అలాగే గ్రామస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించారు. నియోజకవర్గ ప్రజల





జీవనాడి అయిన రాళ్లపాడు రిజర్వాయర్ అభివృద్ధికి ఇప్పటికే 2.5 కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. అలాగే పలు చెరువుల రిపేర్లు, అభివృద్ధి పనుల కోసం పది కోట్లు మంజూరయ్యాయని, పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. రైతుల విషయంలో అధికారులు కూడా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఇరిగేషన్ డిఈ హాజరతయ్య, రాళ్లపాడు ప్రాజెక్ట్ డిఇ లు వెంకటేశ్వర్లు, శేషయ్య, రాళ్లపాడు రిజర్వాయర్ ఆయకట్టు చైర్మన్ ఏలూరు వెంకటేశ్వర్లు, వి ఆర్ కోట సప్లై ఛానల్ చైర్మన్ తల్లపనేని రవీంద్ర, కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు మండలం మాజీ టిడిపి అధ్యక్షులు నార్నే రోశయ్య, కంద్రా మాల్యాద్రి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఈదర నర్సయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, నిమ్మకాయల రామకృష్ణ బోడపాటి అనిల్, నాదెళ్ల వెంకటరమణయ్య, ఏకాంబరం వెంకటరావు, గంగవరపు బ్రహ్మయ్య, షేక్ రఫీ, షేక్ రూబీ వడ్డెళ్ళ రవిచంద్ర నియోజకవర్గంలోని చెరువు ఆయకట్టు చైర్మన్లు, రైతులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## విజన్ 2047 పై సామూహిక చర్చ




**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 8**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విజన్ 2047 డాక్యుమెంట్‌లోని పది సూత్రాలపై గిద్దలూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సామూహిక చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయి యంగ్ ప్రొఫెషనల్ మొహమ్మద్ ఫౌజాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజన్ 2047 లో పేర్కొన్న పది సూత్రాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడం అత్యంత అవసరం అన్నారు. ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు, నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్), ఇంధన వ్యయం నియంత్రణ వంటి అంశాల ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. అలాగే ఇలాంటి చర్చ కార్యక్రమాలు ప్రజల్లో విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.చర్చలో భాగంగా కొత్త ప్రభుత్వ పథకాలు, పంచాయితీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ నీటి పంపిణీ, గ్రామస్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో ప్రతి వ్యక్తి విజన్ 2047 లోని పది సూత్రాల ప్రాముఖ్యతను తెలుసుకునేలా పంచాయితీ కార్యదర్శులు చురుకుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎంపీడీవో సీతారామయ్య , డిప్యూటీ ఎంపీడీవో , పంచాయితీ కార్యదర్శులు, ఏపీఓ, యూనిట్ సభ్యులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోహ వనం హైడ్రోపోనిక్ యూనిట్‌ను సందర్శించిన విద్యార్థులు






**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 8**

కూరగాయలు మరియు సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి సాంకేతికత' అనే కోర్సులో భాగంగా, సి.ఎస్.పురంలోని కదిరి బాబు రావు వ్యవసాయ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం బి.ఎస్.సి. (ఆనర్స్) వ్యవసాయ విద్యార్థుల బృందం, తమ ప్రాక్టికల్ అనుభవంలో భాగంగా నెల్లూరు లోని ఆరోహ వనం హైడ్రోపోనిక్ యూనిట్‌ను బుధవారం సందర్శించింది. ఈ సందర్శన లో భాగంగా యూనిట్ నిపుణులు డాక్టర్ బసవరాజు మరియు వ్యవస్థాపకులైన శ్రీ సాయి కిరణ్, శ్రీ మహేష్, శ్రీ శ్రీ రామ్‌లతో కలిసి, పాలకూర, పాలక్, రెడ్ లెట్యూస్, లొల్లో బియోండా లెట్యూస్ మరియు పాక్ చోయ్ వంటి ఆకు కూరల సాగు కోసం ఉపయోగించే న్యూట్రియెంట్ ఫిల్మ్ టెక్నిక్ (యన్ ఎఫ్ టి) మరియు వర్టికల్ టవర్ సిస్టమ్స్‌తో సహా అధునాతన హైడ్రోపోనిక్ పద్ధతులను వివరించారు. గ్రో బ్యాగ్స్‌లో కోకోపీట్ ఆధారిత మట్టిలేని సాగు పద్ధతిని ఉపయోగించి ఇంగ్లీష్ దోసకాయ సాగును ప్రదర్శించారు.ఈ సందర్శన, ప్రోట్రే నింపడం మరియు విత్తనాలు నాటడం వంటి నర్సరీ నిర్వహణ పద్ధతులలో విలువైన ప్రత్యక్ష అనుభవాన్ని అందించింది. తద్వారా ఆధునిక, నీటి-పొదుపు మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై విద్యార్థుల అవగాహనను మెరుగుపరిచిందని అన్నారు.

# ఏబీఎన్ రాధాకృష్ణపై నిప్పులు చెరిగిన డాక్టర్. అశోక్ కుమార్

**మీ ఇంట్లో ఆడవారే మహిళలా? వైసీపీలో ఉన్నవారు కాదా?**

**ఏబీఎన్ కార్యాలయం ఎదుట నిరసన**






**అద్దంకి ఆర్సి(పెన్ పవర్), ఏప్రిల్ 08**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలపై ఏబీఎన్ రాధాకృష్ణ ప్రసారం చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలకు నిరసనగా బాపట్ల జిల్లా వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో ఏబీఎన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అద్దంకి వైసీపీ సమన్వయకర్త డాక్టర్ అశోక్ కుమార్, ఏబీఎన్ ఎం.డీ రాధాకృష్ణపై, కూటమి నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తల్లికి, చెల్లికి తేడా తెలియని రాధాకృష్ణ మహిళల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు.

**అవినీతిని ప్రశ్నిస్తున్నారనే.. డైవర్షన్ పాలిటిక్స్..**

అమరావతి పేరిట జరుగుతున్న లక్షల కోట్ల అవినీతిని వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రశ్నిస్తున్నారనే అక్కసుతోనే, ఆ అంశం నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఇలా ఆడవారిని అగౌరవపరుస్తున్నారని అశోక్ కుమార్ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో ఒక ఎమ్మెల్యే ఇంట్లోని ఆడవారిపై ఎవరో నోరు జారితే, ఆ రోజున జగన్ ఆ స్త్రీకి ఎంత గౌరవం ఇచ్చారో తనకు తెలుసునని, దానికి తాను ప్రత్యక్ష సాక్షినని గుర్తుచేశారు. ఆ రోజు "నా భార్యను అన్నారు.. నా తల్లిని అన్నారు" అని గగ్గోలు పెట్టిన నాయకులు, ఈరోజు వైసీపీలోని మహిళలను కించపరుస్తుంటే ఎందుకు మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. మీ ఇళ్లల్లో ఉన్నవారు మాత్రమే ఆడవాళ్లా? మిగతా వారు కాదా? అని ఆయన సూటిగా నిలదీశారు.

**'అంతు చూస్తానన్న 'సనాతని' ఎక్కడ..?**

ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే నేనున్నాను.. అరగంటలో వాళ్ల అంతు చూస్తాను అని ప్రగల్భాలు పలికిన 'సనాతని' (పీ.కే) ఇప్పుడు ఎక్కడున్నారని డాక్టర్ అశోక్ కుమార్ ప్రశ్నించారు. భార్యాభర్తల సంబంధంపై కనీస అవగాహన, గౌరవం లేని వారు ఇలాంటి కోతలు కూస్తుంటే వారిని ఖండించాల్సింది పోయి ప్రభుత్వ పెద్దలు సపోర్ట్ చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల క్రితం అనని మాటలను సైతం తీసుకువచ్చి నేడు అక్రమంగా కేసులు పెడుతూ, కూటమి ప్రభుత్వం తమకు ఒక సరికొత్త దారి చూపిందన్నారు.

**మోకాళ్లపై క్షమాపణలు చెప్పిస్తాం..**

ఆంధ్ర రాష్ట్రంలో నేడు జరుగుతున్న ప్రతి సంఘటనకు సంబంధించి డాక్యుమెంట్లు, వీడియోలను ఆధారాలుగా భద్రపరుస్తున్నామని అశోక్ కుమార్ స్పష్టం చేశారు. 2029లో 175 నియోజకవర్గాల్లో వైసీపీ ఘనవిజయం సాధిస్తుందని, అప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా ఏబీఎన్ రాధాకృష్ణతో మోకాళ్ల దండం పెట్టించి, క్షమాపణ చెప్పిస్తామని ఆయన తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఖబర్దార్.. అలా చెప్పించకపోతే తాము వైసీపీ నాయకులమే కాదని డాక్టర్ అశోక్ కుమార్ సవాల్ విసిరారు. ఈ నిరసన కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటు పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## పేదల వైద్యం, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**-మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**-మరమ్మత్తు పనులు పరిశీలించిన మంత్రి డిఎస్ బీవీ స్వామి**





**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం ఏప్రిల్ 08 :**

పేదల వైద్యం, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. కొండపి సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మరమ్మత్తు పనులు, ప్రహరీ గోడ నిర్మాణ పనులు బుధవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులకు సూచించారు, త్వరగా పనులు పూర్తిచేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పేదల వైద్యం, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసారని విమర్శించారు. నేడు పేద ప్రజలకు అన్ని విధాలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

## ఆటో బోల్తా పలువురికి గాయాలు

**కొనకనమిట్ల పెన్ పవర్ ఏప్రిల్ 8**

అడవి పందులను తప్పించబోయి కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడిన ఘటన కొనకనమిట్ల మండలం చిన్నారికట్ల జంక్షన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో పలువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికుల వివరాల ప్రకారం పెదారికట్ల గ్రామానికి చెందిన కూలీలు ఉదయం కొత్తపల్లె గ్రామానికి మిరపకాయలు కోసేందుకు ఆటోలో బయలుదేరారు.చిన్నారి కట్ల జంక్షన్ వద్ద అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన అడవి పందులను తప్పించబోయిన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడగా,మరికొందరికి స్వల్ప గాయాలు అయ్యాయి.గాయపడిన వారిని స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసిపి చేసిన దాడి హేయమైన చర్య



**-మాజీ ఎమ్మెల్యే దివి శివరాం -డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో వైసిపి , జగన్ మోహన్ రెడ్డి దిట్ట**

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 8**

తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రౌడిమూకలు చేసిన దాడిని కందుకూరు మాజీ శాసనసభ్యులు , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో పత్రికలు , ప్రసార మాధ్యమాలపై దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని , నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువస్తున్న మీడియా సంస్థల గొంతు నొక్కాలని చూడటం , భౌతిక దాడులకు పాల్పడటం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి , నాయకులకు అలవాటుగా మారిందని శివరాం మండిపడ్డారు. పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడికి పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని శివరాం డిమాండ్ చేశారు. కష్ట సమయంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థకు , యాజమాన్యానికి మనోధైర్యంతో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి అండగా నిలుస్తామని శివరాం సంఘీభావం తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ , ఢిల్లీలోని లోకసభ రాజ్యసభ చేసిన ఏకగ్రీవ తీర్మానంపై రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ సంతకం చేసి కేంద్ర ప్రభుత్వం పరిధిలోని న్యాయశాఖ ద్వారా గజిట్ విడుదల చేయడంతో ఆందోళన చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ప్రజల దృష్టిని మరల్చడం కోసం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలను ఎన్ని విధాల తప్పుదోవ పట్టించాలని ప్రయత్నం చేసిన ఆంధ్రరాష్ట్ర ప్రజలు విజ్ఞులని వారి దృష్టి అంతా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పైనే ఉందని 2029 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని శివరాం జోస్యం చెప్పారు.

# అన్నా క్యాంటీన్ తనిఖీ కమీషనర్ రమణ బాబు





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 8**

అన్నా క్యాంటీన్ ను మున్సిపల్ కమిషనర్ రమణ బాబు మంగళ వారం తనిఖీ చేశారు. పదార్ధాల నాణ్యత , రుచి , శుచి ని పరిశీలించారు. క్యాంటీన్ లో పదార్ధాలు స్వీకరిస్తున్నవారిని చిరునవ్వుతో పలకరించి పదార్ధాల రుచిని, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. కచ్చితంగా వంటల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని , ప్రభుత్వం పేదల ఆకలి మంటలను తీర్చేందుకు ప్రతిష్టాత్మకంగా కేవలం రు5 /-లకే భోజనం అందిస్తుందన్నారు. భోజనం, టిఫిన్లు రుచిగా ఉంటున్నాయని ఆహారం స్వీకరిస్తన్న ప్రజలు కితాబునిచ్చారు. మానవ సేవయే మాధవ సేవయని , చిరునవ్వులు చిందిస్తూ ఆహారపదార్ధాలను వడ్డించాలని కమీషనర్ రమణ బాబు సిబ్బందికి సూచించారు.

**పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి..:** తెల్ల తెల్లవార కమునుపే పారిశుధ్యం సిబ్బంది రోడ్ల పైకి రాకమునుపే కమీషనర్ రమణ బాబు రోడ్లపైకి వచ్చి పారిశుధ్యం పనులు పరిశీలిస్తూ , మున్సిపాలిటీలో ప్రజకు కౌన్సిలింగ్ ఇస్తూ పారిశుధ్యం పై ప్రతీక దృష్టి సారిస్తున్నారు. మన ఇండ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మీఇంటి వద్దకు చెత్త సేకరించే కార్మికునికి అందజేయాలని , ప్లాస్టిక్ వ్యర్ధాలను ,ఖాళీబాటిల్స్ ను సైడ్ కాలువ ల్లో వేసి మురుగు ప్రవహాన్ని అడ్డుకోవద్దని సూచిస్తున్నారు. సైడ్ కాలువల్లో చెత్త చెదారం వేయటం వలన మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మార్ధాయని తెలిపారు. మెన్ బజార్ , కూరగాయల మార్కెట్ల సమీపంలో వ్యాపారస్తులు చెత్త చెదారం , ప్లాష్టి సామాగ్రి , సింగిల్ యూజ్ కవర్లు సైడ్కారువల్లో వేస్తారని ఇది ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. మున్సిపాలిటీలో శివారు ప్రాంతాల్లో , పలుకాలనీల్లో సిసి రోడ్లు , సైడ్ కాలువల నిర్మాణాలు చేశామన్నారు. అభివృద్ధి లో దూసుకు పోతున్నామని ఆయన తెలిపారు. గ్రామం పట్టణం సుందరంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. చెత్తను రోడ్లపై , సైడ్కాలువల్లో కాకుండా చెత్త సేకరించే కార్మికులకు అందజేయాలన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు..: మున్సిపాలిటీ పరిధిలో వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సహకారం తో అదనంగా బోర్లు వేశామని , కొత్త పైపు లైన్ల ను వేస్తున్నామని తెలిపారు, నూతన పైపులైన్ పనులు పాలు వీధుల్లో పూర్తయ్యాయని కానీ ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయని కమీషనర్ తెలిపారు.

## ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన కృతజ్ఞతలు తెలిపిన ఆర్ డబ్ల్యు ఎస్ సిబ్బంది



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 8**

రాష్ట్ర రాజధాని అమరావతిగా నిర్ణయించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలచిన భారత ప్రధాని నరేంద్ర మోడీని పొదిలి ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం నాడు స్థానిక ఆర్ డబ్ల్యు ఎస్ డివిజన్ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది సమావేశం జరిపి రాష్ట్ర రాజధాని అమరావతి నిర్ణయంలో ప్రధాని కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యు ఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సురేష్ బాబు, కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్ ఆర్ జిలాని భాష, టెక్నికల్ అధికారులు డి నవీన్, వివి రమణ తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలి




**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 8**

పొదిలిలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అతి తక్కువ ధరకే పేదల కడుపు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అన్నా క్యాంటీన్ ఏర్పాటు పొదిలిలో ఇప్పటివరకు జరగకపోవడాన్ని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రకాశం జిల్లా తో పాటు నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా సెంటర్లో పొదిలి పట్టణం ఉంది. మండల కేంద్రమైన పొదిలికి చుట్టుపక్కల ప్రాంతాల నుండి వివిధ పనుల కోసం పేద ప్రజలు, విద్యార్థులు కూలీలు తదితరులు వస్తుంటారు. అన్నా క్యాంటీన్ ఏర్పాటు వల్ల ఆయా వర్గాలకు అతి తక్కువ ధరకే భోజనం దొరికే అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన అన్న క్యాంటీన్ ఏర్పాటులో అధికారులు ఎందుకు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు ఆక్షేపిస్తున్నారు. పొదిలి పట్టణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు కోసం స్థల సేకరణ జరిగి, కొంత నిర్మాణం కూడా జరిగినప్పటికీ, అర్థం తంగా ఆయా పనులు ఎందుకు నిలిపి వేశారో అర్థం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి, పొదిలిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## ఘనంగా చైతన్య ఫార్మసీలో ఫేర్వెల్ డే వేడుక




**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 8**

స్థానిక చైతన్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫేర్వెల్ డే వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విహెచ్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ వెన్నా హనుమారెడ్డి హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ భవిష్యత్తు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, కృషి, నైతిక విలువలను పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా. పి. చంద్రరేఖ అధ్యక్షత వహించి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలేజీలో నేర్చుకున్న జ్ఞానం, విలువలు వారి జీవిత ప్రయాణంలో మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ సభ్యులు రాజిని, రాణి, ఇతర అధ్యాపకులు విద్యార్థులకు తమ ఆశీస్సులు అందించారు. వారు విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మంచి స్థానాలను సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. చివరగా, సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుని, కళాశాల యజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు చేపట్టండి

### జిల్లా కలెక్టర్ విజయ సునీత ఆదేశాలు

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 8**

వెలుగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ దగ్గర ఉన్న సుంకేసు లపునరావాస కాలనీ, ఇడుపూరు, దేవరాజు గట్టు పునరావాస కాలనీ లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు క్రింద కేటాయించిన మొత్తం పునరావాస కేంద్రాలు, ప్రస్తుతం వాటి పరిస్థితి లపై వెలుగొండ ప్రాజెక్టు అధికారులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో జంగిల్ క్లియరెన్స్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా మిగిలి పోయిన సిసి రోడ్లు గుర్తించి పనులు పూర్తి చేయాలన్నారు.. పరిహారం విషయంలోకూడా నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను బట్టి వెంటనే వారికి అంద జేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, మార్కాపురం, కంభం ఎస్ డి సి లు సత్యనారాయణ, వెంకట శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలతో యువత చిత్తు

*గంజాయి డ్రగ్స్ వ్యాపార ముఠాలపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా జలిపించాలి.*

*ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్.*




**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 08**

మత్తు పదార్థాలతో యువత జీవితాలు చిత్తవుతున్నాయని, గంజాయి డ్రగ్స్ వ్యాపార ముఠాలపై ప్రభుత్వం కొరడా జులిపించాలని ఐద్వా ప్రకాశం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలానే యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి లేని సమాజాన్ని నిర్మిద్దామని డివైఎఫ్ఐ యాంటీ డ్రగ్ ఫోరం ఆధ్వర్యంలో ఆరవ తేదీ నుండి 9వ తేదీ వరకు, ప్రచార జీబు జాత జరుగుతోందన్నారు. అందులో భాగంగా బుధవారం గుడ్లూరు మండలంలోకి జాత ప్రవేశించిన సందర్భంగా గుడ్లూరు డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో, గుడ్లూరు హైస్కూల్ దగ్గర జాతాకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుడ్లూరు హైస్కూల్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, గంజాయి, డ్రగ్స్ మాఫియా ముఠాలను ఏరిపారేస్తామని చెప్పారని, కానీ ఆచరణలో గంజాయి డ్రగ్స్ ను నిషేధించడంలో, మాఫియా ముఠాలను అరికట్టడంలో ప్రభుత్వ విఫలం చెందిందని ఆమె అన్నారు. ప్రభుత్వ ఉదాసీనత కారణంగా నెల్లూరు నగరంలో డివైఎఫ్ఐ కార్యకర్త పెంచలయ్య హత్య జరిగిందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒక పార్లమెంటు సభ్యుడు గంజాయి వ్యాపారంలో మునిగి తేలుతున్నందువల్ల ఢిల్లీలో ఆంధ్ర రాష్ట్ర పరువు పోయిందని, వీరిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ఏమాత్రం సిద్ధపడటం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే గంజాయి డ్రగ్స్ ను నిర్మూలించాలని, గంజాయి వ్యాపార ముఠాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ ఫోరం కన్వీనర్ సీహెచ్ వినోద్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.వి.పిచ్చయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి, ప్రజానాట్యమండలి కళాకారుని సుజాత, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు సుంకర విజయలక్ష్మి, గుడ్లూరు ఐద్వా కార్యదర్శి, కే.లక్ష్మీ ప్రసన్న, మల్లేశ్వరి, నేలటూరి,రవణమ్మ అనూష, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు, దాసరి సీతారాం, గుత్తి మల్లికార్జున, ఆటో యూనియన్ నాయకులు, ఎస్.డి సుభాని, డేవిడ్, మహేష్, సిఐటియు మండల కన్వీనర్ కొట్టే వెంకయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## మతం మారితే కులం మారుతుందా...?

-ఆర్ వెంకట్రావు






**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 8:**

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని మతం మారితే కులం మారుతుందా అంటూ సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీ ప్రతినిధులు, పాస్టర్లు, సామాజిక వాదులు తో సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ దళితుల క్రైస్తవులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని, భారత రాజ్యాంగం ప్రకారం ఎవరికి నచ్చిన మతంలో వారు ఉండొచ్చని ఆయన అన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీల నుంచి బీసీ-సీ లోకి మార్చటం సరైనది కాదని సిపిఐ (భారత కమ్యూనిస్టు పార్టీ) తరపున సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా ఖండిస్తుందని ఆయన అన్నారు. బి.ఎస్.పి జిల్లా అధ్యక్షులు గంజి గోపిరాజు మాట్లాడుతూ దళితులు ఏ మతంలో అయినా మారే రాజ్యాంగ హక్కు కల్పించిందని అన్నారు. దళితులపై బూర్జవా పార్టీలు అణచివేత ధోరణి ఇప్పటికీ కొనసాగుతూ ఉందని అందుకు నిదర్శనమే ఈ యొక్క సుప్రీంకోర్టు తీర్పు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్సీ గౌస్, లాయరు ముప్పవరపు కిషోర్, సామాజికవేత్త పాలేటి కోటేశ్వరరావు, బి వెంకటేశ్వర్లు, వైసిపి ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్కే రహీం, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు సిహెచ్ నరేష్, లాయర్ పోకురి కోటయ్య, గ్యార చిరంజీవి, టౌన్ పాస్టర్ల సంఘం అధ్యక్షులు జనార్ధన్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనంద్ మోహన్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి చంద్రమోహన్, గౌడ్ పేరు రాము, మండలాల పాస్టర్ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఎద్దుల బండలాగుడు పోటీలు





**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 8**

స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ బ్రహ్మోత్సవాలు భాగంగా బుధవారం ఎస్వీకేపీ కళాశాల ప్రాంగణంలో ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ పోటీలు మూడు రోజులపాటు సీనియర్, జూనియర్ విభాగాలలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను తిలకించడానికి స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలు ప్రజలు హాజరయ్యారు.ఈ పోటీలను శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలో పాల్గొన్న ఎద్దుల యజమానిని స్థానిక జర్నలిస్టులు షీల్డ్, దూశలవతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ కాశీనాథ్, బిజెపి నాయకులు కృష్ణారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, తెలుగుదేశం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# దేశం సమగ్ర అభివృద్ధి చెందాలంటే బిజెపితోనే సాధ్యం

## జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కొండిశెట్టి వెంకటరమణయ్య

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 8**

భారతదేశం అభివృద్ధితో పాటు పట్టణ గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధి జరగాలంటే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీతోనే సాధ్యపడుతుందని బిజెపి సీనియర్ నాయకులు మన ఊరు మన జెండా జిల్లా కో కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య మరియు జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసుల రెడ్డి అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం శివాలయం వీధిలో బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మన ఊరు మన జెండా కార్యక్రమంలో భాగంగా బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ మరియు రాష్ట్ర అధ్యక్షులు పి వి యన్ మాధవ్ ఆదేశాల మేరకు బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు సూచనలతో మేరకు బిజెపి మండల అధ్యక్షులు పాశం రామకృష్ణ, మరియు మన ఊరు మన జెండా పాలకుడు, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం అధ్యక్షతన బిజెపి పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు మన ఊరు మన జెండా జిల్లా కో కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య మాట్లాడుతూ పూర్వ జనసంఘ్ పార్టీ నుండి నేటి భారతీయ జనతా పార్టీ 47 సంవత్సరాల ప్రయాణం పూర్తి చేసుకొని ఆనాటి జన సంఘ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ రూపొందించిన పంచనిష్టలు, పంచ పరివర్తన అంత్యోదయ మూల సిద్ధాంతంతో ప్రారంభమై మొట్ట మొదటి పార్టీ అధ్యక్షులుగా మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పాయ్ 1980 లో భారతీయ జనతా పార్టీ పేరుతో పార్టీని స్థాపించి లాల్ కృష్ణ అద్వానీ, మురళి మనోహర్ జోషి, కుశబాబు ట్రాక్రే, బంగారు లక్ష్మణ్, జానా కృష్ణమూర్తి, ఎం వెంకయ్య నాయుడు, రాజనాథ్ సింగ్, నితిన్ గట్కారి, అమిత్ షా, జేపీ నడ్డా, ప్రస్తుత బిజెపి అధ్యక్షులు నితిన్ నబీన్ నాయకత్వంలో పార్టీ అభివృద్ధి చెందిందని అన్నారు మొట్టమొదటిగా పోటీ




చేసిన స్థానాలలో రెండు పార్లమెంట్ సీట్లతో ప్రారంభమైన ప్రధానమంత్రి గా అటల్ బిహారి వాజ్ పాయ్ మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 నుండి 2019, 2024 మూడు దఫాలుగా బాధ్యతలు చేపట్టి భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో విశ్వ గురువుగా నింపుతూ భారతీయ చిత్రపటం లో కాషాయ మయం చేసి, అత్యధిక రాష్ట్రాలు బిజెపి పార్టీ ప్రభుత్వాలను, కొన్ని రాష్ట్రాల్లో ఎన్డీఏ ప్రభుత్వం, ఏర్పాటు చేస్తూ అనేక సంక్షేమ పథకాల తోటి ముందుకు తీసుకెళ్తూ భవిష్యత్తులో అన్ని రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యే విధంగా బిజెపి బలోపేతం చేశారని అన్నారు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు సమృద్ధిగా నిధులు కేటాయిస్తుందని కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత బిజెపి కార్యకర్తలపై ఉందని అన్నారు ప్రజలు జవాబుదారితనం పారదర్శక పాలన అవినీతి నిర్మూలనకు దేశ ప్రజలు బిజెపి పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు బిజెపి ప్రయాణాన్ని సాధించిన విజయాలను గుర్తు చేశారు పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, యువతకు



ఉపాధి అవకాశాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు దేశవ్యాప్తంగా ప్రజాసేవలో ముందంజలో నిలుస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యకర్తల బలాన్ని కలిగిన రాజకీయ పార్టీగా ఎదిగిందని అన్నారు ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ దేశభక్తి సిద్ధాంత నిబద్ధత క్రమశిక్షణ సేవాభావం బిజెపి ప్రత్యేకతలని పేర్కొన్నారు దేశంలోని వివిధ రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు ఈ సందర్భంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు జాజం చిన్న సుబ్బయ్య, తిప్పలూరి శ్రీనివాసులు, పెనుమాల చెన్నయ్య, రబ్బా రాయుడు, రెబ్బ చౌడయ్య, రెబ్బ రాయుడు, మన్నేపల్లి మాల్యాద్రి, గంజికొండ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

---

# నమ్మించి నట్టేట ముంచారు

## మొక్కజొన్న రైతు ఆక్రందన

## ఎడిఎకు, జిల్లా రైతు నాయకులకు ఫిర్యాదు



**పెన్ పవర్ అర్ధవీడు ఏప్రిల్ 8**

మొక్కజొన్న సాగు చేస్తే ఎకరాకు నాలుగు టన్నులు వస్తుందని చెప్పి మోసం చేసి నట్టేట ముంచారని నారాయణపల్లెకు చెందిన వల్లెల రంగస్వామి రెడ్డి బుధవారం మార్కాపురం ఎడిఎకు, జిల్లా రైతు నాయకులు గాలి వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన వివరాల మేరకు అర్ధవీడు మండలం పాపనేనిపల్లి గ్రామానికి చెందిన శ్రీ రామ్ సీడ్స్ ఏజెంట్ బొల్లారపు రమణారెడ్డి దగ్గర విత్తనాలు తీసుకున్నానన్నారు. విత్తనాలు ఇచ్చేటప్పుడు ఎకరాకు 4 టన్నుల ప్రకారం ప్రొడక్షన్ వస్తుందని నమ్మబలికారని అన్నారు. అగ్రిమెంట్ ఇస్తామని చెప్పి తీరా సాగు చేసిన తర్వాత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్వాన్స్ ఎనిమిది లక్షలు ఇస్తామని కేవలం నాలుగు లక్షలు ఇచ్చినాడు అని అన్నారు. 645, 691, 686, 676, 682, 675, 685/3 సర్వే నెంబర్లలో మొత్తం 33 ఎకరాలు మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. ఇప్పటివరకు 15 ఎకరాలను మొక్కజొన్న తీయగా కేవలం 12 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతాది తీస్తున్నానని అన్నారు. కంపెనీకి చెందిన నాయక్ అనే వ్యక్తి సలహాలు ఇచ్చారని ఆ సలహాలు పాటించి మొక్కజొన్నను సాగు చేశానని పేర్కొన్నారు. నాకు ఎకరాకు నాలుగు టన్నులు ఇస్తామని చెప్పారని ఆ విధంగానే ఎకరాకు నాలుగు టన్నుల ప్రకారం ఇప్పించాలని ఎడిఎకు, రైతు నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈయన వెంట పలువురు రైతులు ఉన్నారు.

# కుక్కను తప్పించబోయి..

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

## శోకసంద్రంలో మునిగిన మృతుడి కుటుంబ సభ్యులు



**అద్దంకి ఆర్సి(పెన్ పవర్), ఏప్రిల్ 08**

అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన కుక్కను తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘోర ప్రమాదం సంతమాగులూరు మండలం, పాతమగులూరు గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.?సంతమాగులూరు మండలం, ముత్తనపల్లి గ్రామానికి చెందిన బత్తువాల. బ్రహ్మానందం(53) బుధవారం తెల్లవారుజామున 01.00 గంటల సమయంలో తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వినుకొండ వైపు ప్రయాణిస్తున్నాడు. పాతమగులూరు చర్చి ఎదురుగా రాగానే ఒక్కసారిగా ఓ కుక్క రోడ్డుకు అడ్డంగా వచ్చింది. వేగంగా వెళుతున్న సమయంలో కుక్క అడ్డురావడంతో, దాన్ని ఢీకొట్టకుండా తప్పించే క్రమంలో బ్రహ్మానందం వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. ?దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి, అతడు పైనుంచి ఒక్కసారిగా రోడ్డుపై కిందపడిపోయాడు. కింద పడిన వేగానికి బ్రహ్మానందం తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య అనవాయమ్మ (45) ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి వరకు తమతో పాటే ఉన్న భర్త రోడ్డు ప్రమాదంలో విగతజీవుడిగా మారడంతో మృతుడి భార్య, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



*మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రాములు (60) అనారోగ్యం తో మృతి చెందారన్న వార్త తెలుసుకుని వెళ్లి ఆయన పార్థివదేహానికి పూలమాలతో నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైయస్సార్ సిపి నియోజకవర్గ ఇంచార్జి అన్నా రాంబాబు మరియు పార్టీ నాయకులు.*

---

# భూగర్భ జలాలను సంరక్షించడం అందరి భాధ్యత





**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 8**

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో డాక్టర్ పి సుజాత అధ్యక్షతన జలధార జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మండల ప్రత్యేక అధికారి ఎస్ ఈ ఇరిగేషన్ అధికారి జి వరలక్ష్మి మాట్లాడుతూ భూగర్భ జలాలను సంరక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వర్షపు నీటిని సమర్థంగా నిలువ చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరత సమస్యను అధిగమించవచ్చని అన్నారు. అలాగే సాగునీటి సంఘాల సభ్యులు చురుకుగా పాల్గొని 100 రోజుల ప్రత్యేక డ్రైవ్ ద్వారా చెరువుల లోతు పంపు మట్టి తొలగింపు కాలవల శుద్ధి మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆమె తెలిపారు. అనంతరం పొన్నలూరు చెరువుల పరిశీలించి తగ సూచనలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ రవి, ప్రదీప్, సిహెచ్ కోటేశ్వరరావు మహేందర్ రెడ్డి, ఏపీ ఓ సుధాకర్, నీటి సంఘం అధ్యక్షులు మండవ ప్రసాద్, సన్నమూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను సందర్శించిన డిఆర్డిఏ పిడి నారాయణ

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 8**

స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆర్ అండ్ డి ఇనిస్టిట్యూట్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ను జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ, జిల్లా సీడప్ జెడిఎం శ్రీనివాసులు బుధవారం సందర్శించారు. సెంటర్లోని మౌలిక సదుపాయాలు, ల్యాబ్ వసతులు, హాస్టల్, క్యాంటీన్ సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు.తరగతి గదులు, ఐటి ల్యాబ్, కుట్టుమిషన్ ల్యాబ్, క్యాంటీన్ మెనూ, హాస్టల్ భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై విద్యార్థులను స్వయంగా ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. సెంటర్ సదుపాయాలపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేయడంతో పీడీ నారాయణ ప్రశంసించారు.విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ, శిక్షణ అనంతరం జాబ్ ప్లేస్మెంట్ అవకాశాలపై సీడప్ అమలు చేస్తున్న కార్యక్రమాలను వారికి విపులంగా వివరించారు.విద్యతోనే భవిష్యత్తుకు భరోసా, గౌరవం లభిస్తాయి. పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలంటే క్రమశిక్షణ, లక్ష్యం స్పష్టత, నిరంతర సాధన అవసర మని పీడీ నారాయణ విద్యార్థులకు సూచించారు. పోటీ పరీక్షల్లో ఎలా సిద్ధపడాలో వివరిస్తూ చె, ఉద్యోగ యత్నాల్లో మెరుగుపడేందుకు అవసరమైన ప్రీ-మెటీరియల్ ను విద్యార్థులకు అందజేశారు. సీడప్ ద్వారా లభించే ఉచిత నైపుణ్య-ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ



కార్యక్రమాన్ని జెడిఎం శ్రీనివాసులు పర్యవేక్షించి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి విద్యార్థులకు విలువైన సూచనలు సలహాలు అందించినందుకు ఇనిస్ట్యూట్ ఎండి మువ్వా రంగనాయకులు పిడినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో జెసిఓ నర్మదా, ఇనిస్టిట్యూట్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం

## మంగళగిరి ఎయిమ్స్లో చికిత్స పొందుతూ మృతి



**అద్దంకి ఆర్సి(పెన్ పవర్), ఏప్రిల్ 08**

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న తన కల నెరవేరలేదన్న తీవ్ర మనస్తాపంతో ఓ యువకుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రైవేట్ స్కూల్ టీచర్గా పనిచేస్తున్న ఆ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ?అద్దంకి మండలం, కలవకూరు గ్రామానికి చెందిన గుంజి. రవి, నాగేంద్రం దంపతుల కుమారుడు నవీన్ (27) చిలకలూరిపేట ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా సంతమాగులూరు మండలం, కుందుర్రు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఉన్నత విద్యావంతుడైన నవీన్.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యాడు. తన కల నెరవేరలేదన్న మనస్తాపంతో కుందుర్రులో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ?నవీన్ ఎలుకల మందు తాగిన విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని అద్దంకిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి మార్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణాలు విడిచినట్లు బుధవారం సంతమాగులూరు ఎస్.ఐ పట్టాభిరామయ్య తెలిపారు.. చేతికొచ్చిన కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం కోసం ఆశపడి, అది దక్కకపోవడంతో ప్రాణాలు తీసుకోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి తల్లి గుంజి. నాగేంద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ మృతితో కలవకూరు గ్రామంతో పాటు అతను నివాసం ఉంటున్న కుందుర్రులోనూ తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

---

# ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి





**వలేటివారిపాలెం, పెన్ పవర్, ఏప్రిల్ 08**

ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని నెల్లూరు జిల్లా డ్వామా పీడీ గంగా భవాని అన్నారు. బుధవారం స్థానిక వలేటివారిపాలెం ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరిగింది. ఈకార్యక్రమానికి నెల్లూరు జిల్లా డ్వామా పీడీ గంగా భవాని హాజరయ్యారు. 2024-2025 సంవత్సరం లో మండలంలోని 21 పంచాయతీల్లో 630 పనులు జరిగినట్లు తెలిపారు. ఇందుకు గాను 15 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ప్రజా వేదిక లో చదివి వినిపించారు. బడేవారిపాలెం, కొండారెడ్డి పాలెం, కాకుటూరు, సింగమనేని పల్లి, నలదల పూరు, నూకవరం గ్రామాల్లో మస్టర్లు దిద్దుబాటు చేసి నగదు డ్రా చేసినట్టు గుర్తించారు. బాధ్యతాయుతంగా పని చేయలేనివారు అవసరంలేదని ఏపీఓ దయాసాగర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దగ్గర జీతం తీసుకుంటున్నప్పుడు సక్రమంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివీఓ విజయలక్ష్మి , ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శంకరరావు, ఏపీఓలు దయాసాగర్, ఉమా మహేష్, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డఆర్పీలు, ఎస్సార్పిలు పాల్గొన్నారు.

# ఎంపీ అప్పల నాయుడును కలిసిన కోనంగి వెంకట కొండయ్య



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 8**

విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడును టిడిపి క్లస్టర్ ఇంచార్జిల శిక్షణా తరగతులకు విచ్చేసిన సందర్భంగా బుధవారం మంగళగిరి జాతీయ పార్టీ కార్యాలయంలో సి ఎస్ పురం మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జి కోనంగి వెంకట కొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా వెంకట కొండయ్య మాట్లాడుతూ క్లస్టర్ ఇంచార్జిలతో నిర్వహించిన చర్చల్లో భాగంగా పార్టీ బలోపేతంపై ఎంపీ అప్పలనాయుడు స్పష్టమైన సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించుటకు కృషి చేయాలని,పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు తప్పకుండా ఉంటుందని సూచించినట్లు తెలిపారు.

# బెదిరింపులతో సరేనా.... చర్యలకు దిగుతారా

**విజయవాడ ఏప్రిల్ 8,పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్లీన్ పాలిటిక్స్ నినాదంతో వచ్చిన జనసేన పార్టీకి ఇప్పుడు తన సొంత ఎమ్మెల్యేల వ్యవహారశైలి పెద్ద సవాలుగా మారింది. 100 శాతం స్ట్రైక్ రేట్‌తో 21 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు వారిపై వస్తున్న వరుస ఆరోపణలతో డిఫెన్స్‌లో పడాల్సి వస్తోంది. కొత్తగా ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేల అతి ఉత్సాహం, వ్యక్తిగత వివాదాలు, ఆర్థిక ఆరోపణలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యక్తిగత వ్యవహారం ఇప్పుడు జనసేన పార్టీకి నైతిక సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. ఆయనపై వచ్చిన ఆరోపణలు, ఆపై బాధితురాలిపై జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడ్డారన్న వార్తలు సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించాయి. హైకమాండ్ ఈ విషయంలో త్వరితగతిన స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ అయోమయానికి గురవుతోంది. తప్పు చేస్తే సొంత వారినైనా వదలను అని చెప్పే పవన్ కళ్యాణ్, ఈ విషయంలో మౌనం వహించడం ప్రత్యర్థులకు ఆయుధంగా మారింది. విశాఖపట్నం శివారు నియోజకవర్గాల పరిధిలోని ఒక కీలక ఎమ్మెల్యేపై పారిశ్రామికవేత్తల నుండి, రియల్టర్ల నుండి భారీగా వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ముఖ్యంగా భూ వివాదాల్లో తలదూర్చడం, సెటిల్మెంట్లు చేయడం వంటి పాత రాజకీయ వాసనలు జనసేన ఎమ్మెల్యేల నుంచి రావడం పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధం. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడం భవిష్యత్తులో పార్టీ

ఉనికికే ప్రమాదకరంగా మారవచ్చు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి చుట్టూ ఇప్పుడు మనీలాండరింగ్ ఆరోపణలు తిరుగుతున్నాయి. విచారణ సంస్థల వద్ద ఉన్న సమాచారం అంటూ వస్తున్న వార్తలు జనసేనను ఇరకాటంలోకి నెట్టాయి. ఒకవైపు పవన్ కళ్యాణ్ అవినీతి రహిత పాలన గురించి మాట్లాడుతుంటే, మరోవైపు కీలక మహిళా ఎమ్మెల్యేపై ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు రావడం పార్టీకి కొత్త సమస్యలను సృష్టిస్తోంది. జనసేన ఎమ్మెల్యేలలో అత్యధికులు రాజకీయాలకు కొత్త వారు కావడమే ఈ సమస్యలకు మూలమని భావిస్తున్నారు. తొలిసారి అధికారం దక్కడంతో, దానిని ఎలా నిర్వహించాలో తెలియక కొందరు అహంకారం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, నియోజకవర్గాల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల కూటమిలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలతో కూడా ఘర్షణలు

తలెత్తుతున్నాయి. ఈ అపరిపక్వత పవన్ కళ్యాణ్ కష్టపడి సంపాదించిన విశ్వసనీయత ను దెబ్బతీస్తోంది. ఇటీవల పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశమై, ప్రజల్లో వ్యతిరేకత వస్తే ఉపేక్షించేది లేదు అని ఘాటుగా హెచ్చరించినట్లు ప్రచారం

జరిగింది. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై రహస్యంగా సర్వేలు చేయిస్తున్నానని, అవినీతికి పాల్పడితే టికెట్లు ఉండవని కూడా స్పష్టం చేశారు. జనసేన పార్టీ భవిష్యత్తు ఇప్పుడు పవన్ కళ్యాణ్ తీసుకునే కఠిన నిర్ణయాలపైనే ఆధారపడి ఉంది. కేవలం సలహాలు, సూచనలతో సరిపెట్టకుండా, వివాదాస్పద ఎమ్మెల్యేలను పక్కన పెట్టడం లేదా బాధ్యతల నుండి తప్పించడం వంటి చర్యలు తీసుకుంటేనే పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం నిలుస్తుందని భావిస్తున్నారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

షరతులు వర్తిస్తాయి


## విశాఖ టూ మావిగన్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8, పెన్ పవర్:** రాజధానుల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక స్టాండ్ అంటూ లేకుండా పోతోంది. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్న జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తీసుకొచ్చారు. మచిలీపట్నం- విజయవాడ- గుంటూరును కలుపుతూ మావిగన్ రాజధాని ఏర్పాటు చేయాలని ప్రత్యామ్నాయం సూచించారు. దాదాపు అమరావతి రాజధానికి దగ్గరగానే ఆయన సూచనలు ఉన్నాయి. కానీ ఇన్ని పరిణామాలు జరిగిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఈ మాట చెప్పడమే విమర్శలకు తావిస్తోంది. చంద్రబాబు అమరావతి ప్రతిపాదన చేసినప్పుడే ఈ మావిగన్ సూచించి ఉంటే బాగుండేది. పోనీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులు అనేకంటే.. ఈ మావిగన్ ప్రతిపాదన చేసి ఉంటే బాగుండేది. కానీ ఇప్పుడు ఆ ప్రతిపాదన చేస్తుండడం మాత్రం ఇబ్బందికరంగా మారింది. అనవసరంగా ఆయన టార్గెట్ అవుతూ వస్తున్నారు.ఒకవైపు మావిగన్ ప్రతిపాదన చేయగా.. ఇంకోవైపు ధర్మాన లాంటి సీనియర్ నేత వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అన్యాయం గురించి ప్రశ్నిస్తున్నారు. నిన్నటి వరకు ఇదే ధర్మాన మేధావి ఉత్తరాంధ్రకు రాజధాని ప్రకటించడాన్ని హర్షించారు. విశాఖ పాలన రాజధానిని ఆహ్వానించారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఊరువాడ ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు ఆయన జగన్మోహన్ రెడ్డిని ఏం అనడం లేదు. ఆది నుంచి చంద్రబాబు స్టాండ్ అమరావతి. ఆయన మాట మార్చలేదు. కానీ మూడు రాజధానుల్లో భాగంగా విశాఖను పాలన రాజధాని చేస్తానన్నారు జగన్. దానిని విస్తృతంగా ప్రచారం చేశారు ధర్మాన. 2024 ఎన్నికలకు ముందు ఈ సీనియర్ నేత తన సొంత నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో దీనిపైనే డిబేట్ పెట్టారు. ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు జగన్ మూడు రాజధానుల నుంచి మావిగన్ వైపు వెళ్తే దాని గురించి పట్టించుకోవడం లేదు.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగింది అంటే అది జగన్మోహన్ రెడ్డి చేసినట్టే. జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలోని విశాఖను పాలనా రాజధానిగా ప్రకటించారు. దానిని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు ధర్మాన. ఇప్పుడు అదే జగన్ విశాఖ కాదు మావిగన్ అంటున్నాడు. కానీ ధర్మాన జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని.. విభజన చట్టమే చెప్పిందని.. 80 ఏళ్ల వయసులో కూడా ఉత్తరాంధ్ర ప్రజలు పొట్ట చేత పట్టుకుని వలస వెళుతున్నారని.. రాయలసీమ బిడ్డగా ఉండి ఆ ప్రాంత అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారని నిలదీస్తున్నారు ధర్మాన. కానీ విశాఖ పాలన రాజధానిగా ప్రకటించి.. దాని నుంచి పక్కకు తప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డిని మాత్రం ఏమీ అనడం లేదు. అందుకే ధర్మాన అపరమేధావి అయ్యారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలు నమ్మలేని స్థితికి చేరుకున్నారు.

## ఎందుకు జూన్ 2024 తీసుకున్నారు...

**విజయవాడ ఏప్రిల్ 8, పెన్ పవర్:** ఏపీప్రజల ఆకాంక్ష నెరవేరింది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం 2014 సవరిస్తూ తీసుకొచ్చిన బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయగా.. న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2024 జూన్ రెండు నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. అమరావతి గెజిట్ నోటిఫికేషన్ లో 2024 జూన్ రెండు నుంచి రాజధానిగా గుర్తించినట్టు పేర్కొనడంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అదే తేదీ నుంచి ఎందుకు అని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఉమ్మడి ఏపీకి హైదరాబాద్ రాజధానిగా ఉండేది. అయితే విభజన తర్వాత కూడా అంటే 2014 నుంచి 2024 వరకు పదేళ్లపాటు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ను ఉంచారు. అయితే ఆ గడువు 2024 జూన్ 2 తో ముగిసింది. ఈ క్రమంలోనే 2024 జూన్ రెండు నుంచి అమరావతి ఏకైక రాజధానిగా పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది.అయితే ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలు ఉన్నాయి. ఉమ్మడి రాజధానిగా హైదరాబాదుకు ఇచ్చిన గడువు ముగియడం ఒకటి అయితే.. మూడు రాజధానుల ఎపిసోడ్ కు చెక్ పెడుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అయింది. రాబోయే రోజుల్లో ఎలాంటి వివాదాలు లేకుండా చట్ట సవరణపై స్పష్టత ఇచ్చారు. ఒకవేళ భవిష్యత్తులో రాజధాని అమరావతి ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలంటే పార్లమెంటుకు మాత్రమే అధికారం కట్టబెట్టారు. శాసనసభలో సవరణ చేసి మార్పు చేస్తామంటే కుదిరే పని కాదు.అయితే అంతా మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే అమరావతికి చట్టబద్ధత కల్పించారని భావించారు. కానీ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కు ఉన్న గడువు ముగిడంతోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారన్న విషయం చాలామందికి తెలియదు. ఎంతవరకు మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే.. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనుకున్నారు. కానీ 2024 జూన్ 2 తో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగిసిందని కేవలం కొద్ది మందికి మాత్రమే తెలుసు

## అంతర్జాతీయ హోటల్ గా రుషికొండ



**విశాఖపట్టణం ఏప్రిల్ 8,పెన్ పవర్:** రుషికొండ భవనాల అదృష్టం త్వరలో మారబోతోంది. ఈ ప్యాలెస్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై కేబినెట్ సబ్ కమిటీ కసరత్తును ముగించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఈ భవనాలను ప్రజాధనానికి భారంగా కాకుండా, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే వనరుగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 10న జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.గతంలో రుషికొండపై ఉన్న హరిత రిసార్ట్స్ ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి సుమారు 7 కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. కానీ ప్రస్తుతం నిర్మించిన ప్యాలెస్ నిర్వహణకే నెలకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చవుతోంది. విద్యుత్ ఛార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి ఏడాదికి 3 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చవుతుండటంతో, ప్రభుత్వం దీనిని ప్రోపర్ యుటిలైజేషన్ చేయాలని నిర్ణయించింది. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, సుమారు 1517 మంది నుంచి సేకరించిన సూచనల ఆధారంగా ప్రభుత్వం ఒక ప్రణాళికను రూపొందించింది. రుషికొండ ప్యాలెస్ నిర్వహణకు ప్రపంచస్థాయి గుర్తింపు ఉన్న లితాజ్ గ్రూప్, ఎట్మాస్పియర్ కోర్, లీలా, ఫెమా వంటి నాలుగు ప్రముఖ సంస్థలు ఆసక్తి కనబరిచాయి. ఈ భవనాలను ఒక విలాసవంతమైన హోటల్ లేదా రిసార్ట్‌గా మార్చడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ నాలుగు గ్రూపుల్లో ఒకదానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించి, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్యాలెస్‌ను కమర్షియల్ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నప్పటికీ, సామాన్య ప్రజలు కూడా ఆ భవనాలను సందర్శించేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇది కేవలం ఒక రహస్య బంగ్లాగా మిగిలిపోకుండా, విశాఖ పర్యాటకంలో ఒక భాగంగా మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదించింది. ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు, ప్రజలకు కూడా దీని వల్ల ప్రయోజనం ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈనెల 10న కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే ఈ విలాసవంతమైన భవనాల కొత్త రూపం ఖరారు కానుంది.

## మై టిడిపి యాప్ ద్వారా ప్రతిభ కనబరిచిన అట్లూరి కృష్ణంరాజుకు సత్కారం







**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 8**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మై టిడిపి యాప్ ద్వారా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మండల టిడిపి సీనియర్ నాయకులు అట్లూరి రామకృష్ణంరాజును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాలువా తో ఘనంగా సత్కరించి పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత నందమూరి తారకరామారావు చిత్ర పటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా అట్లూరి రామకృష్ణంరాజు మాట్లాడుతూ "మై టిడిపి యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాల్లో నిరంతరం చురుకుగా పాల్గొనడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా కేవలం 10 మందిని మాత్రమే పార్టీ అధిష్టానం ఎంపిక చేసిందని, ఆ జాబితాలో నాకు చోటు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా అట్లూరి రామకృష్ణంరాజును రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సేవలను డిజిటల్ వేదికలో ప్రజలకు చేరవేస్తూ, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేస్తూ రామకృష్ణంరాజు పార్టీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు.

## విజయవాడ స్టేడియానికి మహర్దశ

**విజయవాడ, ఏప్రిల్ 8, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అంతర్జాతీయ హంగులు అద్దుకోబోతోంది. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ స్టేడియంను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరుద్ధరించాలని నిర్ణయించింది. విజయవాడ నగరాన్ని ఒక స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఇది మొదటి అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆధునీకరణ పనులకు సంబంధించి ఈ నెల 8వ తేదీన అధికారికంగా శంకుస్థాపన జరగనుంది.రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఈ కార్యక్రమానికి హాజరై పనులను ప్రారంభించనున్నారు. క్రీడాకారుల కోసం అత్యాధునిక వసతులు మరియు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. పునరుద్ధరణలో భాగంగా స్టేడియంలో అత్యాధునిక రన్నింగ్ ట్రాక్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఇండోర్, అవుట్ డోర్ కోర్టులు నిర్మించనున్నారు. శిక్షణలో ఉండే క్రీడాకారుల కోసం అధునాతన హాస్టల్ సౌకర్యాలు, జిమ్ మరియు ఇతర సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు ఈ స్టేడియం వేదికగా మారనుంది. ప్రపంచ స్థాయి పోటీలకు సరిపడేలా స్టేడియం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు స్థానికంగానే అత్యుత్తమ శిక్షణ అందేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బెజవాడ క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ప్రభుత్వం మొత్తం రూ. 53 కోట్లు వెచ్చించనుంది. ఇందులో మొదటి విడతగా రూ. 30 కోట్లతో పనులను ప్రారంభించనున్నారు.2027 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి, 2029లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన స్టేడియం మధ్యలో 400 మీటర్ల పొడవైన, 8-లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగించి, ఆ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను నిర్మించనున్నారు. టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ మరియు కబడ్డీ కోసం అదనంగా కొత్త ఔట్‌డోర్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.

## మళ్లీ తెరపైకి గ్రేటర్ రాయలసీమ

**కర్నూలు, ఏప్రిల్ 8,పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ వాదం తెరపైకి వచ్చింది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగిన టైమ్‌లోనే రాయలసీమ అస్తిత్వం అంటూ చర్చలు జరిగాయి. ఇప్పుడు గ్రేటర్ రాయలసీమ అంటూ మాజీమంత్రి మైసూరారెడ్డి మరోసారి స్లోగన్ అందుకున్నారు. నవ్యాంధ్రలో ఇప్పుడిప్పుడే రాజధాని వ్యవహారం ఒక కొలిక్కి వచ్చిందని అంతా అనుకుంటున్నారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణా విడిపోయాక 2014 నుంచి 12 ఏళ్లుగా ఏపీ రాజధాని అంశం ప్రతి రోజు చర్చకు వస్తోంది.ఇప్పుడు అమరావతి రాజధానిగా పార్లమెంట్ ఉభయసభలు లైన్ క్లియర్ చేసినా..వైసీపీ మాత్రం మావిగన్ స్లోగన్ బలంగా వినిపిస్తోంది. ఏపీ రాజధానిగా అమరావతికి హోదా దక్కిందన్న సంతోషం దక్కిందో లేదో..వైసీపీ క్యాపిటల్ ఫైట్‌కు తెరలేపింది. సరే అది ఎప్పటికీ ఉండే ముచ్చటే అనుకుంటే..సీనియర్ రాజకీయ నేత మాజీమంత్రి మైసూరారెడ్డి ఒక బాంబు పేల్చారు. ఏపీలో రాజధాని పరిణామాలు, రాజకీయాలు చూస్తుంటే గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం తప్పదని అనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు.ఏపీలో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిషన్ చేసిన సిఫార్సులను గుర్తు చేశారు. అమరావతి ప్రాంతాన్ని కానీ విజయవాడ గుంటూరును కానీ రాజధానిగా ఎంపిక చేయొద్దని శివరామకృష్ణన్ కమిషన్ కీలక సూచనలు చేసిందంటున్నారు. దొనకొండ దగ్గర ఏకంగా 70 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కూడా కమిషన్ చెప్పిందన్నారు. అంతే కాదు రాజధాని నిర్మాణం కోసం వ్యవసాయ భూములను తీసుకోవద్దని ప్రైవేట్ భూములు అంతకంటే తీసుకోవద్దని కమిషన్ చెప్పిందంటున్నారు.కానీ 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పట్టుబట్టి మరీ వ్యవసాయ భూములు, పైగా ముంపు ప్రాంతం అయిన అమరావతిని ఎంపిక చేశారని మైసూరారెడ్డి విమర్శించారు. మావిగన్ పేరుతో జగన్ కొత్త ప్రతిపాదనలు చేయడం మరింత బాధాకరం అన్నారు. నాడు అమరావతికి ఓకే చెప్పి..ఆ తర్వాత మూడు రాజధానుల నినాదాన్ని ముందుకు తెచ్చారన్నారు. ఇప్పుడు మావిగాన్ అంటూ అర్థం పర్దం లేని మాటలు ఎందుకు అంటూ మండిపడ్డారు. శివరామ కృష్ణన్ కమిషన్ వద్దు అన్నచోటే ఈ ఇద్దరు నాయకులు రాజధాని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఈపాటికే గ్రేటర్ రాయలసీమ ఉద్యమాన్ని ప్రారంభించాల్సి ఉందని, వయసు కారణంగా ఆగిపోతున్నానని అంటున్నారు. కానీ రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై యువత స్పందించాలని వారు గ్రేటర్ రాయలసీమ నినాదంతో ఉద్యమించాలని మైసూరారెడ్డి పిలుపు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.గ్రేటర్ రాయలసీమ డిమాండ్ కొత్తేమీ కాదు. ఏపీ, తెలంగాణ విభజన సమయంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రాయల తెలంగాణ కావాలని సోనియా గాంధీకి విన్నవించారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలను తెలంగాణతో కలిపితే అది ఒక బలమైన రాజకీయ శక్తిగా మారుతుందని ఆయన కోరారు. ఇక బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి లాంటి వాళ్లు ప్రత్యేక రాయలసీమ అంటూ దీక్షలు కూడా చేశారు. రాయలసీమ హక్కులు, నీళ్లు, నిధులు అంటూ కొన్నాళ్లు హడావుడి చేసి సైలెంట్ అయిపోయారు. గ్రేటర్ రాయలసీమ అంటూ మైసూరారెడ్డితో పాటు గంగుల ప్రతాప్‌రెడ్డి వంటి నేతలు గతంలోనే తెరమీదకు తెచ్చారు.ఆంధ్రప్రదేశ్ పర్యాటకంఒకప్పటి రాజధాని కర్నూలుతో పాటు మొత్తం రాయలసీమ ప్రాంతానికి ఇప్పటికీ అన్యాయం జరుగుతుందని చెబుతున్న నేతలు..కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు దక్షిణ కోస్తా జిల్లాలైన నెల్లూరు, ఒంగోలు జిల్లాలను కలిపి గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం చేయాలన్నది వీరి ప్రధాన డిమాండ్. 2014లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా కొందరు సీమకు అన్యాయం జరుగుతోందని ఆందోళనలు చేపట్టారు. కానీ, 2019 నుంచి 2024 వరకు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఈ గళం పూర్తిగా మూగబోయింది. ఆ సమయంలో రాయలసీమ గురించి ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా..ఓ వైపు అమరావతికి చట్టబద్ధత దక్కిన వేళ..గ్రేటర్ రాయలసీమ నినాదాన్ని పొలిటికల్ స్క్రీన్‌పైకి తేవడం ఆసక్తికరంగా మారింది.

### ఒప్పుకుంటున్నా.. మా బౌలర్లను బుడ్డోడు వణికించిందు:

# సూర్యవంశీపై ముంబై కోచ్ ప్రశంసలు




**హైదరాబాద్ పెన్ పవర్:** 15 ఏళ్ల యంగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ముంబై ఇండియన్స్?పై ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మంగళవారం (ఏప్రిల్ 7) గౌహతి వేదికగా జరిగిన ఈ మ్యాచులో ముంబైపై కేవలం 14 బంతుల్లోనే 39 రన్స్ చేసి రాజస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ప్రపంచ మేటి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్?లో ఒకే ఓవర్లో రెండు సిక్సులు కొట్టి అందరిని ఔరా అనిపించాడు ఈ ఏళ్ల చిచ్చర పిడుగు. ప్రత్యర్థి జట్టు హెడ్ కోచే స్వయంగా వైభవ్?కు కితాబు ఇచ్చాడంటే అతడి బ్యాటింగ్ ఏ విధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.
ముంబై, రాజస్థాన్ మ్యాచ్ అనంతరం ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేల జయవర్ధనే వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ ఎదుగుదల చూడటం చాలా ఉత్సాహంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాపై సూర్యవంశీ చూపిన పట్టుదల అందరి దృష్టిని ఆకర్షించిందని కొనియాడాడు. వైభవ్ తన డేరింగ్ అండ్ డాషింగ్ బ్యాటింగ్?తో ముంబై బౌలర్లు ఇబ్బంది పెట్టాడని జయవర్ధనే ఒప్పుకున్నాడు.
లాస్ట్ ఇయర్ ఐపీఎల్?లోనే అతడి టాలెంట్ ఏంటో ప్రపంచానికి తెలిసిపోయిందన్నాడు. వైభవ్ దగ్గర మంచి స్కిల్ ఉందంటూ అతని ఆత్మవిశ్వాసాన్ని, అగ్రశ్రేణి బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రశంసించారు. యశస్వీ జైశ్వాల్ కూడా ముంబైపై అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని అన్నారు. మొదటి మూడు ఓవర్లలో అతను బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతమని.. చాలా చక్కటి షాట్లు ఆడాడని ప్రశంసించారు. ఐపీఎల్ 19వ సీజన్లో రాజస్తాన్ రాయల్స్ హవా కొనసాగుతోంది. మెగా టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్లోనూ రాయల్స్ విజయం అందుకుంది. మంగళవారం వర్షం అంతరాయం కలిగించిన పోరులో యశస్వి జైస్వాల్ (32 బాల్స్లో 40 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆర్ఆర్ 27 రన్స్ తేడాతో ముంబై ఇండియన్సు్ను ఓడించింది. ఆడిన మూడు మ్యాచ్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్కు చేరుకుంది. 11 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి తొలుత బ్యాటింగు వచ్చిన రాజస్తాన్ 150/3 స్కోరు చేసింది.వైభవ్ సూర్యవంశీ (14 బాల్స్లో 1 ఫోర్, 5 సిక్సర్లతో 39) కూడా దంచికొట్టాడు. అనంతరం ఛేజింగ్లో ముంబై 11 ఓవర్లలో 123/9 స్కోరు మాత్రమే చేసి ఓడిపోయింది. షెర్ఫానే రూథర్ఫర్డ్ (8 బాల్స్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25), నమన్ ధీర్ (13 బాల్స్లో 3 ఫోర్లు, 1 సిక్స్ 25) టాప్ స్కోరర్లు. రవి బిష్ణోయ్, సందీప్ శర్మ, బర్గర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. జైస్వాల్కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# కోట్ల రూపాలు తీసుకునే ముందే తెల్వదా: ఓవర్సీస్ ప్లేయర్లపై గవాస్కర్ ఫైర్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఫారెన్ ప్లేయర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఫ్రాంచైజీలు పోటీ పడి మరీ కోట్లు కుమ్మరించి ఓవర్సీస్ ఆటగాళ్లను కొనుగోలు చేస్తాయి. కానీ కోట్ల జీతం తీసుకుంటున్నా విదేశీ ఆటగాళ్లు కొందరు లీగ్?కు అందుబాటులో ఉండటం లేదు. కొందరు వేలంలో పాల్గొని ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాక మేం ఆడమని చెబుతున్నారు. ఇంకొందరు లీగ్ స్టార్ట్ అయ్యాక వివిధ కారణాలతో టోర్నీ నుంచి వైదొలుగుతున్నారు. వీళ్ల తీరుతో జట్టు సమతుల్యం దెబ్బతిని ఆయా ఫ్రాంఛైజీలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఓవర్సీస్ ప్లేయర్ల తీరుపై భారత మాజీ క్రికెటర్ గవాస్కర్ ఫైర్ అయ్యారు. తమ హెల్త్ కండిషన్ ఎలా ఉంది..? టోర్నీకి పూర్తిగా అందుబాటులో ఉంటామా లేదా అనే విషయం ఆటగాళ్లకు ముందే తెలియదా అని ప్రశ్నించారు. తమకు చేతకాదని తెలిసినప్పుడు టోర్నీలో ఆడతామని రావడం ఎందుకని నిలదీశారు. టీ20ల్లో ఒక బౌలర్ కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే వేస్తాడని.. ఆ నాలుగు ఓవర్లు వేసేందుకు కూడా శరీరం సహకరించపోతే క్రికెట్ ఆడటం కన్నా రెండు నెలలు రెస్ట్ తీసుకోవడమే మంచిదని చురకలంటించారు. అంతేకానీ కోట్లకు కోట్ల రూపాయలు జీతం తీసుకుంటూ ఫ్రాంచైజీలను ఇబ్బంది పెట్టడం సబబు కాదని అన్నారు. ఒక ఆటగాడికి దేశమే ముఖ్యం ఇందులో ఎలాంటి సందేహం లేదు.. కానీ కోట్ల రూపాయలు తీసుకుంటున్న ఫ్రాంచైజీల పట్ల కూడా నిబద్ధత చూపించాలి కదా అని అన్నారు. షెడ్యూల్ అడ్జస్ట్?మెంట్ కాకపోతే మొత్తం టోర్నీకి దూరంగా ఉంటే ఎవరికీ ప్రాబ్లమ్ ఉండదని.. కానీ ఫ్రాంచైజీలు కొనుగులు చేసిన తర్వాత మధ్యలోనే వదిలి వెళ్లడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కొన్ని దేశాల క్రికెట్ బోర్డులు ఐపీఎల్ ఆడేందుకు ఆటగాళ్లకు ఎన్వోసీ ఇవ్వకపోవడంపై కూడా గవాస్కర్ సీరియస్ అయ్యారు. ప్రతి విదేశీ ఆటగాడి ఐపీఎల్ జీతంలో 10% ఫీజును ఆయా దేశాల క్రికెట్ బోర్డులు తీసుకుంటాయి. ప్రపంచంలోని మరే ఇతర టీ20 లీగ్‌లోనూ ఇలాంటి నిబంధన లేదు. ఐపీఎల్ కేవలం విదేశీ ఆటగాళ్లకే కాకుండా వారి బోర్డులకు కూడా కాసుల పంట పండిస్తున్నప్పుడు టోర్నీలో ఆడేందుకు ఎందుకు అనుమతి నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ , జోష్ హేజిల్‌వుడ్ వంటి ఆటగాళ్లు వివిధ కారణాలతో ఐపీఎల్ 2026లో ఇంకా ఆడలేదు. ఫిట్‌నెస్ పరీక్షలలో ఉత్తీర్ణులు కాలేదని శ్రీలంక క్రికెట్ బోర్డు వనిందు హసరంగా, ఈషాన్ మలింగ, మతీష పతిరానా ఎన్వోసీ ఇవ్వలేదు.

# బుమ్రా బౌలింగ్‌లో స్కోరు చేస్తానని చెప్పి చేసి చూపించాడు...
# అతడ్ని టీమిండియాలోకి తీసుకోవాలి: ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యలు





**హైదరాబాద్ పెన్ పవర్:** “గత ఏడాది బుమ్రా బౌలింగ్‌లో ఔటయ్యాను. ఈసారి అతడి బౌలింగ్‌లో పరుగులు చేయాలి”... ఇది ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పెట్టుకున్న లక్ష్యం. చెప్పడమే కాదు, గతరాత్రి ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ స్థాయి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో
దూకుడుగా ఆడి దాన్ని చేసి చూపించాడు. ఈ అద్భుత ప్రదర్శనపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంసల వర్షం కురిపించాడు.వైభవ్ ప్రదర్శనపై స్పందించిన ఇర్ఫాన్, అతడిని వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐకి సూచించాడు. “వైభవ్ ఒక యువ సంచలనం. 15 ఏళ్ల వయసులో వైట్ బాల్ క్రికెట్‌లో ఇంతటి పరిణతితో కూడిన ప్రదర్శన అసాధారణం. బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడం చాలా కష్టం. అలాంటిది, అతడిపై పరుగులు చేస్తానని చెప్పి, చేసి చూపించాడు. తన లక్ష్యాన్ని చేరుకున్నాడు” అని ఇర్ఫాన్ కొనియాడాడు.“ఈ కుర్రాడిని ఎక్కువ కాలం వేచి చూసేలా చేయొద్దు. ఇప్పుడే జాతీయ జట్టులోకి తీసుకుంటే, అతడు సుమారు 20 ఏళ్ల పాటు దేశానికి సేవలందించగలడు” అని ఇర్ఫాన్ అభిప్రాయపడ్డాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లోనే 39 పరుగులు బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అగ్రశ్రేణి బౌలర్లను సైతం ఎదుర్కొని నిలకడగా రాణిస్తుండటంతో, ఇర్ఫాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# పర్ఫెక్షన్ కోసం వెనుకడుగేసిన ఎన్టీఆర్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో భారీ ప్రాజెక్ట్ డ్రాగన్ ప్రస్తుతం అనూహ్యంగా వార్తల్లో నిలిచింది. ఈ నెలలో ప్రారంభం కావాల్సిన కీలక షూటింగ్ షెడ్యూల్ అకస్మాత్తుగా నిలిచిపోవడంతో, సినిమా రిలీజ్ పై సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రకటించిన రిలీజ్ డేట్ మిస్ అయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది.

**లుక్ తో అసంతృప్తి**

అయితే ఈ బ్రేక్ వెనుక ఉన్న కారణం ఏదో నార్మల్ రీజన్ కాదు. సినిమా కోసం రెడీ చేసిన కొత్త లుక్ విషయంలో ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇద్దరూ పూర్తిగా సంతృప్తి చెందకపోవడంతో షూట్‌ను ఆపాలని డిసైడ్ అయ్యారట. పర్ఫెక్షన్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, లేటైనా సరే బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

**మే లో కొత్త షెడ్యూల్**

కాగా ఈ సినిమాలో ఎన్టీఆర్ పలు వేరియేషన్లలో కనిపించనున్నారని తెలుస్తోంది. మల్టిపుల్ లుక్స్‌తో పాటు కొత్త గెటప్స్‌పై ప్రయోగాలు జరుగుతుండటంతో, ఆయన కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన పాత్రగా నిలవొచ్చనే అంచనాలను పెంచుతోంది. అభిమానులు కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ స్కేల్ పరంగా కూడా డ్రాగన్ ఓ భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఇప్పటికే





జోర్డాన్‌లో ఒక కీలక షెడ్యూల్ పూర్తి చేసిన యూనిట్, ఇటీవల శంషాబాద్ సమీపంలోని ఆలయంలో వారం రోజులపాటు షూటింగ్ నిర్వహించింది. ప్రస్తుతం నగర అవుట్‌స్కర్ట్స్‌లో భారీ సెట్ నిర్మాణం జరుగుతుండగా, అక్కడి నుంచే వచ్చే నెలలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ పాన్- ఇండియా స్థాయిలో విజువల్ గ్రాండియర్‌గా నిలవబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**డ్రాగన్ విషయంలో తారక్ పై భారీ ఒత్తిడి**

ఇదిలా ఉండగా, బాలీవుడ్‌లో వచ్చిన వార్2 తర్వాత ఎన్టీఆర్‌కు ఈ సినిమా అత్యంత కీలకంగా మారింది. వార్2 తో ఆశించిన స్థాయి విజయం దక్కకపోవడంతో, డ్రాగన్ ద్వారా ఎలాగైనా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే ఒత్తిడి కూడా అతనిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్ పై అభిమానుల అంచనాలు కూడా భారీగా పెరిగాయి. సోషల్ మీడియాలో ఈ డిలే అంశంపై మిక్స్ రియాక్షన్ కనిపిస్తోంది. కొంతమంది అభిమానులు ఇంకెంత లేట్? అంటూ అసహనం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం మంచి అవుట్‌పుట్ కోసం సమయం తీసుకోవడం సరైన నిర్ణయమేనని టీమ్‌కు మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికి, డ్రాగన్ టీమ్ తీసుకున్న ఈ డెసిషన్ రిస్క్‌తో కూడుకున్నదే. ఒకవైపు డిలే వల్ల మార్కెట్‌లో ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, మరోవైపు పర్ఫెక్ట్ అవుట్‌పుట్ సాధిస్తే అది భారీ రివార్డ్‌గా మారే అవకాశం ఉంది. కంటెంట్‌పై ఉన్న కాన్ఫిడెన్స్, క్లియర్ విజన్‌తో ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్ట్ నిజంగా తారక్ లైఫ్ లో గేమ్ ఛేంజర్ అవుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com